

రూ.15,266 కోట్లతో సిఫీ డేటా సెంటర్

- ఐటీ పార్కులో 3.6 ఎకరాలు, పరదేశిపాలెంలో 25 ఎకరాలు కేటాయింపు
- రెండేళ్లలో ఆపరేషన్లు ప్రారంభించాలని టార్గెట్

... మెయిన్‌లో

హోమ్ స్టే

పర్యాటకాభివృద్ధికి కొత్త విధానం

ప్రభుత్వ ప్రోత్సాహం

- ఇంట్లోనే బస
- 'హోమ్ స్టే...బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' పేరిట ప్రత్యేకంగా పోర్టల్
- ఔత్సాహికులు అందులో పేర్లు నమోదుచేసుకోవాలి
- సందర్శనీయ ప్రాంతాలకు చేరువలో ఉండాలి
- రెండు దశల్లో పరిశీలించాకే అనుమతులు



- నిర్వాహకులకు ప్రభుత్వ రాయితీలు
- రుణాలు, డొమెస్టిక్ విధానంలో పన్నులు
- పర్యాటకులకు వసతి
- స్థానికులకు ఉపాధి

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో పర్యాటకాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రభుత్వం 'హోమ్ స్టే' విధానాన్ని ప్రోత్సహిస్తోంది. పర్యాటక ప్రాంతాల్లో సందర్శనకు వచ్చే వారికి అవసరమైన సంఖ్యలో హోటళ్లు లేకపోవడంతో ఇళ్లనే అతిథి గృహాలుగా మార్చేందుకు అవకాశం కల్పిస్తోంది. వీటిలో బస...ఇంట్లో ఉన్నట్టే అనిపిస్తుంది. ఆహారం కూడా కుటుంబ సభ్యులు తయారుచేసినట్టుగా ఉంటుంది. దీనికి చెల్లించే మొత్తాలు కూడా అందుబాటులో ధరలో ఉంటాయి. వీటివల్ల స్థానికులకు కూడా ఆదాయం కూడా సమకూరుతుంది. అందుకని ప్రభుత్వం దీనికోసం ప్రత్యేకంగా 'హోమ్ స్టే... బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' పేరుతో పాలసీని తీసుకువచ్చింది. దీని ద్వారా అర్హులైన వారికి పెట్టుబడి సాయం, రాయితీలు, ప్రోత్సాహకాలను అందిస్తుంది.

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఎవరైనా తమ ఇంట్లో పర్యాటకులకు ఆతిథ్యం ఇవ్వాలని అనుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక పోర్టల్ 'హోమ్ స్టే...బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్'లో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. ఇవి రెండు రకాలు. యజమాని ఆ ఇంట్లో ఉంటూ...ఒకటి నుంచి ఆరు గదులు అతిథులకు కేటాయించగలిగితే దానిని 'హోమ్ స్టే'గా పరిగణిస్తారు. యజమాని వేరే ప్రాంతంలో ఉంటూ తన ఇంటిని వేరే వారికి ఇచ్చి వారి ద్వారా అతిథులకు ఇస్తే దానిని 'బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్' (బీఅండ్‌బీ)గా పరిగణిస్తారు.

వెరిఫికేషన్ తరువాతే అనుమతి

పోర్టల్‌లో హోమ్ స్టే, బీఅండ్‌బీలకు దరఖాస్తు చేసుకుంటే దానిని రెండు దశల్లో పరిశీలిస్తారు. మొదట స్థానిక పోలీసులు వచ్చి అన్నీ తనిఖీ చేస్తారు. నిర్వాహకులపై పోలీస్ కేసులు, అసాంఘిక శక్తులతో సంబంధం లేదని నిర్ధారించుకున్న తరువాత అధికారులకు సిఫారసు చేస్తారు. ఆ తరువాత పర్యాటక శాఖ, పంచాయతీ/కార్పొరేషన్ అధికారి వచ్చి పరిశీలిస్తారు. వారు సంతృప్తి చెందాక జిల్లా కమిటీకి సిఫారసు చేస్తారు. కలెక్టర్ అధ్యక్షతన పని చేసే కమిటీ తుది అనుమతి ... మిగతా 6వ పేజీలో

నేడు మంత్రి లోకేశ్ రాక

- రుషికొండ హిల్ నంబర్-3పై సిఫీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- అనంతరం పార్టీ కార్యాలయానికి...
- మధ్యాహ్నం 2.30 గంటల నుంచి పీఎం పాలెం స్టేడియంలో భారత-ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌ను తిలకించనున్న మంత్రి



విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదివారం నగరానికి వస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి తొమ్మిది గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి 9.50 గంటలకు రుషికొండ ఐటీ పార్కులోని హిల్ నంబరు-3కు చేరుకుని సిఫీ డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి 2.30 గంటలకు పీఎం పాలెం క్రికెట్ స్టేడియానికి వెళ్లి భారత్-ఆస్ట్రేలియా మహిళా జట్ల మధ్య జరగనున్న వన్డే మ్యాచ్‌ను తిలకిస్తారు. రాత్రి 11 గంటలకు స్టేడియం నుంచి విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో గన్నవరం వెళతారు. కాగా హిల్-3పై సిఫీ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్న నేపథ్యంలో ఏపీఐఐసీ హిల్-3కు వెళ్లే రోడ్‌లో రాత్రి పూట లైటింగ్ ఏర్పాటుచేశారు.

ఉక్కుకు తొలగని చిక్కులు!

యాజమాన్య నిర్ణయాలే కారణం

- తప్పుల మీద తప్పులు
- ఉద్యోగులపై నిందలు
- ఉత్పత్తి వ్యయం పెరగడమే నష్టాలకు కారణం
- ఆ విషయం పట్టించుకోని మంత్రిత్వ శాఖ
- కర్మాగారంలో ఒకే అధికారికి కీలకమైన రెండు పోస్టులు
- కమిటీ ఎంపిక చేయని అధికారికి సీఎండీ బాధ్యతలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగ్గా దృష్టిసారించడం లేదు. ప్లాంటుకు నష్టాలు రావడానికి యాజమాన్య నిర్ణయాలే కారణం. ఇందులో ఉద్యోగులు, కార్మికుల పాత్ర వీసమెత్తు కూడా లేదు. కీలక నిర్ణయాలన్నీ ఉన్నత స్థాయిలో తీసుకుంటూ ఉత్పత్తి తగ్గిపోయిందని, నష్టాలు వస్తున్నాయని, ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని ప్రచారం చేస్తున్నారు.

దాదాపు మూడు దశాబ్దాల క్రితం నాటి విశాఖపట్నం స్టీల్ ప్లాంటుకు ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపడితేనే అన్ని విభాగాలు సక్రమంగా నడుస్తాయి. గత నాలుగేళ్లుగా నిర్వహణకు నిధుల కేటాయింపు నామమాత్రం చేశారు. ముడి పదార్థాల సరఫరా తగ్గిపోయింది. ఆ మేరకు ఉత్పత్తి పడిపోయింది. ఈ వైఫల్యాలపై విచారణ చేయడం లేదు. ఉద్యోగుల సంఖ్య ఎక్కువ ఉందని, వారి సంఖ్య కుదిస్తే మూడు శాతం ఖర్చులు తగ్గుతాయని ఇటీవల సుమారు 1,600 మందికి వీఆర్‌ఎస్ ఇచ్చారు. మరో ఐదు వేల మంది కాంట్రాక్టు కార్మికులను ఆకస్మికంగా తొలగించారు. అలాగే పూర్తిస్థాయి ఉత్పత్తికి రోజుకు తొమ్మిది ర్యాకులతో ఐరన్ ఓర్ తెప్పించాల్సి ఉండగా కేవలం 5.5 ర్యాకులు మాత్రమే వస్తున్నాయి. దీంతో ఎక్కువ రేటు పెట్టి పెల్లెట్లు కొంటున్నారు. దీనివల్ల టన్నుకు రూ.3 వేలు అదనంగా ఖర్చు అవుతోంది. ఉత్పత్తి వ్యయం 10 శాతం పెరిగింది. ఉద్యోగుల తగ్గింపు ద్వారా 3 శాతం పొదుపు చూపించి, అధిక రేట్లతో అదనంగా ఏడు శాతం ఉత్పత్తి వ్యయం ఎందుకు పెంచారని కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రశ్నించడం లేదు.

కమిటీ ఎంపిక చేయని సీఎండీ

ప్రభుత్వ రంగ సంస్థల్లో డైరెక్టర్లు, సీఎండీలను కేంద్ర ప్రభుత్వ ఏర్పాటుచేసిన ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి నియమిస్తారు. ఇక్కడ ప్రస్తుతం సీఎండీగా ఉన్న అజయ్‌కుమార్ సక్సేనా ఆర్‌ఐఎన్‌ఎల్ ఉద్యోగి కాదు. మాంగనీస్ ఓర్ ఇండియా లిమిటెడ్ సీఎండీ. ఇన్‌చార్జి సీఎండీగా విశాఖ ఉక్కులో అదనపు బాధ్యతలు ఇచ్చారు. పీకల్లోతు నష్టాలు కష్టాల్లో ఉన్న సంస్థకు పూర్తిస్థాయి సీఎండీని ఎంపిక చేసినా బాధ్యతలు ఇవ్వకుండా ఎవరి నిర్ణయం మేరకు సక్సేనాను ఇంకా కొనసాగిస్తున్నారనేది అంతుపట్టని రహస్యం.

అడ్డగోలుగా రెండు బాధ్యతలు

విశాఖ ఉక్కులో ఒకే అధికారికి రెండు కీలకమైన డైరెక్టర్ పోస్టులు కట్టబెట్టారు. జీవీఎస్ ప్రసాద్ కమర్షియల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆయనకు ఆరు నెలల క్రితం ఫైనాన్స్ డైరెక్టర్ పోస్టు కూడా కట్టబెట్టారు. ఆయనకు ఫైనాన్స్ రంగంలో అనుభవం ఏమీ లేదు. ఆర్థిక ఇబ్బందులో ఉన్న సంస్థకు నైపుణ్యం, అనుభవం కలిగిన అధికారిని నియమించకుండా అసలు ఫైనాన్స్‌పై అవగాహన లేని వ్యక్తిని కూర్చోబెట్టారు. ఆ రెండు పోస్టులు ఒకరికే ఇవ్వడం నిబంధనలకు వ్యతిరేకం. ఎందుకంటే కమర్షియల్ డైరెక్టర్ హోదాలో ముడి పదార్థాల కొనుగోళ్లు, ఉత్పత్తుల అమ్మకాల ధరలు ఆయన నిర్ణయిస్తారు. ఆ నిర్ణయాలు ఆర్థికంగా సంస్థకు లాభమా?, నష్టమా? అని ఫైనాన్స్ డైరెక్టర్ పరిశీలించి ఆమోదిస్తారు. ఇప్పుడు అడిగేది ఆయనే...మంజూరు చేసుకునేది ఆయనే కావడంతో తప్పులు జరగడానికి అవకాశాలు ఉన్నాయి. ఇలా ఉన్నత స్థాయిలో తప్పులు మీద తప్పులు చేస్తూ ఉద్యోగులే నష్టాలకు కారణమని ప్రచారం చేస్తున్నారు. వారికి సరిగ్గా జీతాలు ఇవ్వకుండా, రోజూ 12 గంటలు అధికంగా పని చేయించుకుంటున్నారు. ఈ ... మిగతా 6వ పేజీలో

రూ.3.5 కోట్లతో యాంటీ డ్రగ్ గ్లో థీమ్ పార్కు



కార్యక్రమంలో పాల్గొన్న వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, కమిషనర్ విశ్వనాథన్, తదితరులు



శిలాఫలకం

- సిటీ సెంట్రల్ పార్కులో ఏర్పాటు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

వీఎంఆర్డీఏ సిటీ సెంట్రల్ పార్కులో రూ.3.5 కోట్లతో యాంటీ డ్రగ్ గ్లో థీమ్ పార్కు ఏర్పాటుకు కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు శనివారం వర్చువల్‌గా ... మిగతా 6వ పేజీలో

సై

మహిళల ప్రపంచ కప్ వన్డే టోర్నీలో నేడు భారత్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్



ఆస్ట్రేలియా కెప్టెన్ అలిస్సా హేలీ
భారత్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్

- వేదికగా ఏసీఏ-వీడీసీఏ స్టేడియం
- ఇరుజట్ల ముమ్మర సాధన

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

మహిళల ప్రపంచ కప్ వన్డే టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. టైటిల్ ఫేవరేట్స్‌గా బరిలో నిలిచిన భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరగనున్న ఈ మ్యాచ్‌పై రసవత్తరంగా సాగే అవకాశాలు ఉన్నాయి. దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఓటమి చెందిన భారత్... పొరపాట్లను సరిదిద్దుకుని గెలుపుతో తిరుగు పయనం అవ్వాలనే పట్టుదలతో ఉంది. మరోవైపు ఆస్ట్రేలియా ఇప్పటివరకూ ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ విజయం సాధించింది. శ్రీలంకతో జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దవ్వడంతో ఐదు పాయింట్లతో అగ్రస్థానంలో ఉంది.

టాప్ ఆర్డర్ బ్యాటర్లపై ఆందోళన

భారత్ టాప్ ఆర్డర్ బ్యాటింగ్‌పై ఆందోళన నెలకొంది. ఇప్పటివరకు శ్రీలంక, పాకిస్థాన్, దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లలో టాప్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించ లేదు. ఇక బౌలర్లు నిలకడగా రాణిస్తుండం కొంతవరకు జట్టుకు అనుకూలం. భారత్‌తో పోల్చితే ఆసీస్ టాప్ ఆర్డర్‌తో రాణిస్తున్నారు. బౌలింగ్‌లో కూడా ఆస్ట్రేలియా పటిష్టంగా ఉంది.

ఇరు జట్ల సాధన

భారత్, ఆస్ట్రేలియా జట్ల క్రీడాకారులు శనివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో సాధన చేశారు. ఆస్ట్రేలియా క్రికెటర్లు పూర్తిస్థాయిలో హాజరై బ్యాటింగ్, బౌలింగ్‌లో ముమ్మర సాధన చేశారు. సారథి, వికెట్ కీపర్ అలిస్సా హెలీ ప్రత్యేకంగా వికెట్ల వద్ద కీపింగ్ ప్రాక్టీస్ చేసింది. భారత్ జట్టులో కొద్దిమంది మాత్రమే సాధనకు హాజరుకాగా, మిగిలినవారు హోటల్‌కే పరిమితమయ్యారు.

నేడు స్టాండ్, గేట్‌లకు నామకరణం

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని ఒక స్టాండ్‌కు మిథాలీరాజ్ పేరు, ఒక గేటుకు రావి కల్పన పేరు పెట్టనున్నారు. ఆదివారం భారత్, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న మ్యాచ్‌కు ముందు నామకరణాల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై స్టాండ్‌కు మిథాలీరాజ్ పేరు, గేట్‌కు రావి కల్పన పేరును అధికారంగా ప్రకటించి ఆవిష్కరించనున్నారు.

రేషన్ బియ్యం ఎగుమతికి చెక్

- నగరంలో మూడుచోట్ల చెక్‌పోస్టులు

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతిని అడ్డుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కాకినాడ పోర్టుపై గత ఏడాది దాడుల నేపథ్యంలో అక్రమార్కులు విశాఖపట్నం, గంగవరం పోర్టులను ఎంచుకుంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు పొరుగు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశా నుంచి లారీల ద్వారా విశాఖ పోర్టు పరిధిలో ఫ్రైట్ స్టేషన్ల (సరకు రవాణా కేంద్రాలు/గిడ్డంగులు)కు రేషన్ బియ్యం వస్తున్నట్టు నిఘా వర్గాల ద్వారా సమాచారం అందింది. దీంతో ఈ ఏడాది రెండుసార్లు ఫ్రైట్ స్టేషన్లపై దాడులు చేసి భారీగా రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఆ తరువాత అప్పుడప్పుడు పౌర సరఫరాల శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నప్పటికీ అక్రమ రవాణాదారులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ... మిగతా 6వ పేజీలో

ఆర్టీసీకి పండుగ

- దసరా స్పెషల్స్ ద్వారా రూ.1.05 కోట్ల ఆదాయం
- ప్రత్యేక సర్వీసులు 650... 110 శాతం ఆక్యుపెన్సీ



ద్వారకా బస్‌స్టేషన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ విశాఖ రీజియన్ దసరా సమయంలో 650 ప్రత్యేక సర్వీసులు నడిపి రూ.105 కోట్ల అదనపు ఆదాయం గడించింది. సెప్టెంబరు 27 నుంచి ఈనెల 8వ తేదీ వరకూ ఈ ప్రత్యేక సర్వీసులు నడిపింది. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, భీమవరం, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాలకు సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, అల్ట్రా డీలక్స్, గరుడ, గరుడ ప్లస్ వంటి సర్వీసులు ఆపరేట్ చేసింది. జోనల్ పరిధిలోని శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, రాజాం ప్రాంతాలకు 430, విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం, తదితర ప్రాంతాలకు 220 ప్రత్యేక సర్వీసులు నడిపారు.

సగటు ఓఆర్ 110 శాతం

దసరా ప్రత్యేక సర్వీసుల ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్) 110 శాతంగా నమోదైంది. ఇంతకు ముందెన్నడూ ఈ స్థాయిలో ఓఆర్ నమోదు కాలేదని అధికారులు అంటున్నారు. దూర ప్రాంతాలకు రాకపోకలు సాగించిన సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్ అల్ట్రా డీలక్స్ గరుడ, ... మిగతా 6వ పేజీలో

రైళ్లకు దీపావళి తాకిడి

- సికింద్రాబాద్ రైళ్లకు సాధారణం
- బెంగళూరు, చెన్నై, హౌరా రైళ్లకు ఫుల్ డిమాండ్
- నెలాఖరు వరకూ బెర్తులు రిజర్వు
- ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు నవంబరు 10 వరకూ...



విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి):

వరుస సెలవులు రావడంతో దీపావళి సమయంలో రైళ్లకు డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా చెన్నై, బెంగళూరు, భువనేశ్వర్ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రైళ్లలో ఈ నెలాఖరు వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి.

బెంగళూరు రైళ్లు ఫుల్

విశాఖ మీదుగా బెంగళూరు వెళ్లే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ (18463)కు నవంబరు 10 వరకు బెర్తులు నిండిపోయాయి. అలాగే విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863)కు నెలాఖరు వరకూ బెర్తు లభించని పరిస్థితి ఏర్పడింది. ఇంకా భువనేశ్వర్-బెంగళూరు (22833), హౌరా-బెంగళూరు హంసఫర్ (22887), హౌరా-బెంగళూరు దురంతో (12245), హటియా-బెంగళూరు (12835), గువాహటి-బెంగళూరు (12510), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తల-బెంగళూరు హంసఫర్ (12504), కామాఖ్య-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిడిన్ జంక్షన్-బెంగళూరు (22306), హౌరా-మైసూర్ (22817), భువనేశ్వర్-బెంగళూరు (12845), న్యూ టిన్సుకియా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు (15228) ఎక్స్‌ప్రెస్ వంటి బై వీక్లీ, వారాంతపు రైళ్లకు నెలాఖరు వరకు డిమాండ్ నెలకొంది. రెండు, మూడు వారాంతపు రైళ్లలో కొన్ని బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై రైళ్లకు డిమాండ్

కోరమండల్ (12841), మెయిల్ (12839), బొకారో (13351) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), భువనేశ్వర్-చెన్నై ... మిగతా 6వ పేజీలో

Estd. 2008
NSRIT
NADIMPALLI SATYANARAYANA RAJU INSTITUTE OF TECHNOLOGY
(AUTONOMOUS)
(Approved by AICTE, New Delhi || Affiliated to JNTU-GV, AP || An ISO 9001, ISO 14001 & ISO 45001 Certified Institute)
Recognized under2(f) of the UGC Act 1956 || Accredited by NAAC with 'A' Grade (3.10/4.00)
web: www.nsrit.edu.in mail: office@nsrit.edu.in
SONTYAM, PENDURTHI - ANANDAPURAM Highway, Visakhapatnam-531173
AP-EAPCET : 2025 - SPOT ADMISSIONS (CAT-A)
Engineering aspirants who are interested under Spot Admissions for the following programs of B.Tech.(CAT-A) in Civil, EEE, Mechanical, ECE, CSE, CSE (AI & ML), CSE (Data Science) may visit the college with all original certificates on 13th October 2025 from 9.00am onwards. Your admission will be made as per the guidelines issued by APSCHE. Candidates admitted under Spot Admission are not eligible for Government fee reimbursement.
For further details contact: 8099464546, 9885824167
Date: 11-10-2025 Sd/- PRINCIPAL

నాతయ్యపాలెం / గంభీరం
శివకాశి అయ్యన్ బాణాసంచా షోరూమ్
షీలానగర్ : NH-5, మార్బుల్ షాప్ ఎదురుగా, నాతయ్యపాలెం, BHPV పోస్ట్, విశాఖపట్నం. Cell: 98483 59617
అయ్యన్ గ్రీన్ క్రాకర్స్ అమ్మబడును
AYYAN'S GREEN CRACKERS AVAILABLE
COMPANY FRESH ITEM ◈ GENUINE RATES
SIVAKASI'S Ayyan'S FIRE WORKS
For Rates Visit: www.vizagayyan.in
NH-5, Opp. Marble Shop, Natayyapalem, SHEELANAGAR, Vizag-12.

హోమ్ స్టే

... 5వ పేజీ తరువాయి

ఇస్తుంది.

వసతులు చాలా ముఖ్యం

హోటళ్లలో అతిథులకు ఏయే వసతులు ఉంటాయో అవన్నీ హోమ్ స్టే, బీఅండ్ బీలలో కూడా ఉండాలి. రూమ్ కనీస విస్తీర్ణం 100 చదరపు అడుగులు, దాని వాష్‌రూమ్ 24 చ.అ., కార్పెట్, వై-ఫైతో కూడిన ఇంటర్‌నెట్, చక్కని బెడ్లు, ఫోన్, లాండ్రీ సదుపాయం, లాబీ వంటివి ఉండాలి. 24 గంటల పాటు నీటి సదుపాయం ఉండాలి. సీసీ టీవీ కెమెరాలు తప్పనిసరి. ఆహారం కూడా స్థానికంగా లభించేది, అతిథులు కోరుకునేది అందించగలగాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచాలి. స్థానిక భాషతో పాటు ఇంగ్లిష్, హిందీ వచ్చి ఉంటే మంచిది.

మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రుణాలు

హోమ్ స్టే, బీఅండ్‌బీ ఇళ్లను ఆధునికీకరించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగరాల్లో మెప్మా ద్వారా రుణాలు అందిస్తారు. గిరిజనులకు అయితే రూ.5 లక్షలు, పట్టణాల్లో అయితే రూ.3 లక్షలు ఇస్తారు. ఈ హోమ్ స్టేలు అన్నీ పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో సందర్శనీయ స్థలాలకు దగ్గరగా ఉండాలి. ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుంది. హోమ్ స్టే ఇళ్లకు విద్యుత్, నీరు, ఇంటి పన్ను కమర్షియల్‌గా కాకుండా డొమెస్టిక్ విధానంలో చార్జీలను వసూలు చేస్తుంది. ఉత్తమ సేవలకు అవార్డులు కూడా అందజేస్తుంది.

రిజిస్ట్రేషన్‌తో వ్యాపారం

ప్రభుత్వ పోర్టల్‌లో వీటిని నమోదు చేసుకుంటే వ్యాపారం ఎక్కువగా వస్తుంది. పర్యాటకులు వెబ్‌సైట్ చూసినప్పుడు ఏ ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నారో...అక్కడ ఈ స్టేలు అన్నీ కనిపిస్తాయి. ఇంటికి సంబంధించిన ఫొటోలు కూడా అందులో పెట్టడం వల్ల వారికి నచ్చినవి ఎంపిక చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రచారం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. ఇదొక్కటే కాకుండా ఈ వివరాలన్నీ ఓయో, మేక్ మై ట్రిప్, స్టే విస్టా వంటి సంస్థలు కూడా తమ వెబ్‌సైట్లలో ప్రదర్శిస్తాయి. వారి ద్వారా కూడా బుకింగ్స్ వస్తాయి. వీటిలో ఒక్కో గదికి వెయ్యి రూపాయల నుంచి రూ.1,500 వరకు అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏడాదికి 200 రోజులు

రాష్ట్రంలో ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలో ఉన్న హోమ్ స్టేలు, బీఅండ్‌బీలను పది వేలకు చేర్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రతి హోమ్ స్టేకు ఏడాదిలో అంటే 365 రోజుల్లో కనీసం 200 రోజులు అతిథులు వచ్చేలా చేయాలనేది ఆలోచన. దీని ద్వారా పర్యాటకం...దీంతోపాటు స్థానికులకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ హోమ్ స్టేకు సంబంధించి పూర్తి వివరాలకు ప్రభుత్వ మేనేజర్ రాజ్యలక్ష్మిని 9121144095 సెల్ నంబర్‌లో సంప్రతిస్తే మరిన్ని వివరాలు తెలియజేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కనీసం రెండు వేల హోమ్ స్టేలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఖాళీ ఇళ్లను అద్దెకు ఇచ్చుకోవడం కంటే వసతులను మెరుగుపరిచి హోమ్ స్టేగా మార్చుకుంటే మంచి ఆదాయం వస్తుందని పర్యాటక శాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

గరుడ ప్లస్ వంటి ప్రత్యేక సర్వీసుల సగటు ఓఆర్ 95 నుంచి 100 శాతం వరకు నమోదయ్యింది. జోనల్ పరిధిలో రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కనిష్ఠంగా 120 శాతం, గరిష్ఠంగా 130 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. స్త్రీశక్తి పథకం అమలు వల్ల అత్యధిక సంఖ్యలో మహిళలు ఈ బస్సుల్లోనే ప్రయాణించారని అధికారులు అంటున్నారు.

ఆదాయం రూ.1.05 కోట్లు

దసరాకు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేయడం ద్వారా విశాఖ రీజియన్‌కు రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చినట్టు లెక్కలు కట్టారు. ఇందులో నగదుగా వచ్చింది రూ.30 లక్షలు, స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభుత్వం భరించేది రూ.75 లక్షలు. స్త్రీశక్తి పథకం కింద ప్రయాణించిన మహిళల బస్సు చార్జీల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేయాల్సి ఉంటుంది.



రైళ్లకు దీపావళి తాకిడి

... 5వ పేజీ తరువాయి

సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), ముజాఫర్‌పూర్-బెంగళూరు (15228), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) రైళ్లలో నెలాఖరు వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు.

హౌరా రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), చెన్నై-హౌరా కోరమండల్ (12842), చెన్నై-హౌరా మెయిల్ (12840), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ (18046), బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) రైళ్లకు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అంతేకాకుండా బై వీక్లీ, వారాంతపు రైళ్లు వాస్కోడిగామ-షాలిమార్ (18048), తిరుచరాపల్లి-హౌరా (12664), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై-షాలిమార్ (22826), బెంగళూరు-గువాహటి (12509), బెంగళూరు-హౌరా హంసఫర్ (22888), త్రివేండ్రం-షాలిమార్ ఎక్స్‌ప్రెస్ (22641), సికింద్రాబాద్-షాలిమార్ (22850), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (20890), మంగళూరు-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22852), నాగర్‌కోయిల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12659), తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22856) రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. కొన్ని వారాంతపు రైళ్లకు కొన్ని తేదీల్లో మాత్రం బెర్తులు అందుబాటులో ఉన్నాయి

సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గరీబ్‌రథ్ (12739), విశాఖ-నాందేడు (20811), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), దురంతో (22203), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), జన్మభూమి (12805), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సాధారణ రద్దీ నెలకొంది. కోణార్క్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రం నెలాఖరు వరకు ఖరారు బెర్తు లభించే పరిస్థితి లేదు. గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి బెర్తులు ఖాళీ ఉండగా...గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 15 నుంచి కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20833, 20708) ఈ నెల 14 నుంచి ఖాళీలు ఉన్నాయి.

ఘనంగా గౌరమ్మ అనుపోత్సవం

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గౌరమ్మ అనుపోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎన్నింటి వారి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో గ్రామస్తులంతా భక్తి ప్రపత్తులతో పాల్గొని నందన్న, గౌరమ్మలకు పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గౌరమ్మ, నందన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.

గౌరవనీయులైన కృష్ణాజిల్లా 15వ అదనపు జిల్లా జడ్జి - నూజివీడు వారి కోర్టులో

యమ్.వి.ఓ.పి. నెం.40/2023

బిట్వీన్ :-
వనమా చంద్రమ్మ మరియొకరు ... పిటీషనర్స్
మరియు
బోజంకి అప్పల కృష్ణ మరియు ఇతరులు
... రెస్పాండెంట్

టూ:- 2వ రెస్పాండెంట్.
గొల్లపల్లి రామారావు, తండ్రి. తాతారావు, నివాసం: డోర్ నెం.13-590, పార్వతి నగర్ సెక్టార్-2, ఆరిలోవ, విశాఖపట్నం జిల్లా-530040

పై నెంబరు యమ్.వి.ఓ.పి లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది. 30-10-2025 వ తేదీన వున్నది. సదరు తేదీన ఉదయం 10-30 ని లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగాని, లేదా మీ తరపు న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ అక్షేపణలను తెలుపు కొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా

ఇట్లు
నూజివీడు | మన్న నాగేశ్వర రావు, బి. దేవదాసు
ది.09-10-2025 | వాది తరపు న్యాయవాదులు

రూ.3.5 కోట్లతో యాంటీ డ్రగ్ గ్లో థీమ్ పార్కు

... 5వ పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. కార్యక్రమాన్ని వీఎంఆర్డీఏ కార్యాలయం నుంచి చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ యువత తప్పుడు మార్గంలో వెళ్లకుండా వినూత్నమైన యోచనతో ఈ థీమ్ పార్క్ నిర్మించడం మంచి ఆలోచన అని, ఇది విశాఖలో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి వీఎంఆర్డీఏ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రహదారులు అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ పార్కు అనేది ప్రపంచంలో ఇదే మొదటిదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్‌ఈలు భవానీశంకర్, మధుసూదనరావు, సీయూపీ శిల్ప, డీఎఫ్‌వో సుజన శివానీ, పాల్గొన్నారు.

ఉక్కుకు తొలగని చిక్కులు!

... 5వ పేజీ తరువాయి

బాధలు పడలేక చాలామంది ఇతర స్టీల్ ప్లాంట్లలో ఉద్యోగాలు వెదుక్కొని వెళ్లిపోతున్నారు. నగర్‌నార్ స్టీల్ ప్లాంటులో 200 పోస్టులకు ప్రకటన రాగా విశాఖ ఉక్కు నుంచే 800 మంది దరఖాస్తు చేశారు. ఆ ప్లాంటు అడవుల్లో ఉంది. పిల్లల చదువుల గురించి ఆలోచించకుండా ఉద్యోగులు వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారంటే యాజమాన్యం ఎలా పనిచేస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.





రేషన్ బియ్యం ఎగుమతికి చెక్

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణాను నిలువరించేందుకు నగరంలో మూడుచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటుచేస్తున్నారు. ఫ్రైట్ స్టేషన్లు ఉన్న షీలానగర్‌లో రెండుచోట్ల, పెదగంట్యాడలో ఒకచోట చెక్‌పోస్టులు పెట్టి వాహనాలు తనిఖీ చేస్తారు. ఈ వారంలో చెక్‌పోస్టులలో సిబ్బందిని నియమించనున్నారు.




కేజీబీవీకి రహదారి నిర్మాణం

భీమునిపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేజీబీవీకి ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ జోన్ వన్ పబ్లిక్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీరు జి. సురేశ్ శనివారం ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ ఇటీవల మంత్రి లోకేశ్ ఈ విద్యాలయాన్ని సందర్శించినప్పుడు గోతులతో ఉన్న రోడ్డును చూసి చలించిపోయారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు నూతన రహదారి నిర్మాణానికి రూ. 1.91 కోట్ల మంజూరు కావడంతో పనులను ప్రారంభించామని తెలిపారు. వారం రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తామని ఏఈ సురేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.















తెలుగుతో పాటు ఆంగ్లంలోనూ పట్టు ఉండాలి

సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి

తగరపువలస, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలంటే తెలుగుతో పాటు ఆంగ్లంపై కూడా పట్టు సాధించాలని సినీ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాష ఒక్కటే వస్తే ఎటువంటి ప్రయోజనం ఉండదని, ఆంగ్లంలో కూడా ప్రావీణ్యం సంపాదిస్తేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలరని తెలిపారు. అలా అని మాతృభాషను మరిచిపోకూడదన్నారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఇటువంటి శిక్షణల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం వింగ్స్ ఫౌండేషన్ తరఫున ఆనంద్ అందించిన ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఆర్. నారాయణమూర్తి విద్యార్థులకు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి, చిత్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కూడా ఉన్నారు.

శ్రీ పోలమాంబ కొత్తమ్మవారి దేవస్థానం
దేవాదాయ -ధర్మాదాయశాఖ
సంగివలస గ్రామము, భీమునిపట్నం మండలం, విశాఖపట్నం జిల్లా

టెండర్ -కం-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. 1/2025 తే:01.10.2025ది

శ్రీ పోలమాంబ అనబడే కొత్తమ్మవారి దేవస్థానమందు టెండర్-కం-బహిరంగ వేలం తేది 14-10-2025 ఉదయం 11 గంటలకు శ్రీ పోలమాంబ కొత్తమ్మవారి దేవస్థానం, సంగివలస వద్ద కార్యనిర్వాహణాధికారి వారిచే దేవాదాయ-ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించబడును.

వ.నెం.	లైసెన్సు హక్కు వివరము	కాలపరిమితి	ధరావత్తు సొమ్ము
1	చీరలు,జాకెట్టు ముక్కలు	1 సంవత్సరం అనగా 15-10-2025 నుండి 14-10-2026 వరకు	రూ. 10000/-లు
2	కొబ్బరి ముక్కలు		రూ. 10000/-లు

1. ఇతర వివరంలకు ఆఫీసు పనివేళలయందు తెలుసుకొనగలరు. కార్యనిర్వాహణాధికారి

సింహాచలం : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి సీతమ్మధార ప్రాంతానికి చెందిన వై. ఏకాంబరేశ్వరరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్రసాద విభాగర పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు శనివారం ఆయన అందజేశారు.



16 నుంచి అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు అనంత పద్మనాభుడి పవిత్రోత్సవాలు జరగనున్నట్టు దేవస్థానం ఈఓ పీవీఎన్ రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంప్రదాయాలను, ఆనవాయితీని కొనసాగిస్తూ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. నిర్వహణకు సభ్యులంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నగేశ్‌కుమార్, బీజేపీ నేతలు రవికుమార్, మహేశ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.































కనకమహాలక్ష్మి అమ్మవారికి ఘనంగా తులసీ దళార్చన

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో తులసి దళార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించిన పూజలో ఉభయ దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఇకపై ప్రతి మంగళవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన జరుపనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల కోరిక మేరకు మునుపటికంటే ఒక గంట ఆలస్యంగా పుష్పార్చన జరపనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు రూ.1,116 చెల్లించి ఉభయదాతలు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం

అక్కయ్యపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గ్రేటర్ 43వ వార్డులో టీడీపీ అధ్యక్షురాలు బొడ్డేటి శ్రీదేవి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపు వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొడ్డేటి మోహనరావు, రాజగిరి కన్నబాబు, నాయుడు, కన్నారావు, ఆనంద్, లక్ష్మి పాల్గొన్నారు.

'వైద్యుల సమస్యలు పరిష్కరించండి'

మురళీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యసేవల్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మూల వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2,800 మంది వైద్యులు వారం రోజులుగా ఆందోళన చేస్తున్న కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలకు ఆటంకం కలుగుతోందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి వైద్య సంఘం ప్రతినిధులతో సంప్రదింపులు చేయాలన్నారు. గతంలో సర్వీసు డాక్టర్లకు 50 శాతం కేటాయించారని, దాన్ని ప్రస్తుతం 15 శాతానికి రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. దీనివలన స్పెషలైజేషన్ కోర్స్ చదవడానికి వైద్యులకు అవకాశం తగ్గిపోతుందన్నారు. అలవెన్సులు, ఇంక్రిమెంట్లు ఇస్తూ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న డాక్టర్లకు సీట్ల కేటాయింపు ప్రోత్సాహకరంగా ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

డిసెంబరు 14న కాపుల వనభోజన మహోత్సవం

డాబాగార్డెన్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 14న కాపుల వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్టు కాపు యూత్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు మద్దిం శెట్టి సురేష్, ఎర్రంశెట్టి సురేష్ తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వనభోజన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపులందరినీ ఒకే చోటకు చేర్చాలన్న సంకల్పంతో ముడసర్లోవలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. దొరబాబు, ఎస్.సత్యనారాయణ, రాము, సుహాస్, జి.శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, కనకారావు పాల్గొన్నారు.

మృతుడి భార్యకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న సత్యనారాయణ

అక్కయ్యపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీర్ణాశయ క్యాన్సర్‌తో మృతి చెందిన ఎల్లాటి సురేష్ కుటుంబ సభ్యులను స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ పరామర్శించి నిత్యావసర వస్తువులు, రూ.5 వేల నగదు అందజేశారు. గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్ రజక వీధికి చెందిన మృతుడి భార్య సావిత్రికి శనివారం ఆర్థిక సాయం, సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి రజక సేవా సంఘం నాయకులు చిన్నా, ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ అనుపోత్సవం

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గౌరమ్మ అనుపోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎన్నింటి వారి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో గ్రామస్తులంతా భక్తి ప్రపత్తులతో పాల్గొని నందన్న, గౌరమ్మలకు పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గౌరమ్మ, నందన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రేషన్ బియ్యం ఎగుమతికి చెక్

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణాను నిలువరించేందుకు నగరంలో మూడుచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఫ్రైట్ స్టేషన్లు ఉన్న షీలానగర్‌లో రెండుచోట్ల, పెదగంట్యాడలో ఒకచోట చెక్‌పోస్టులు పెట్టి వాహనాలు తనిఖీ చేస్తారు. ఈ వారంలో చెక్‌పోస్టులలో సిబ్బందిని నియమించనున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్ సూచన

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్‌పై గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు సమగ్రమైన అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అర్ధాంగి, ప్రముఖ న్యాయవాది దివ్యా ప్రసాద్ సూచించారు. అక్టోబరులో 'పింక్ మంత్' పేరిట రొమ్ము క్యాన్సర్‌పై ఏర్పాటు చేసిన అవగాహనలో భాగంగా కేజీహెచ్ ఆంకాలజీ విభాగం శనివారం ఓ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దివ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మహిళ తప్పనిసరిగా ఏడాదికోసారి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించటంతో పాటు, మహిళలకు మెమోగ్రామ్, ఇతర అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.బుచ్చిబాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే సకాలంలో నయం చేయవచ్చని తెలిపారు. కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న అన్ని వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. గాలిలో పింక్ బెలూన్‌లను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, పలువురు వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.



కేజీహెచ్‌లో కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్‌ను సత్కరిస్తున్న వైద్యాధికారులు, చిత్రంలో సూపరింటెండెంట్ ఐ.వాణి తదితరులు

బాధ్యత గల పౌరులుగా మెలగాలి: సీపీ బాగ్చి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందచేస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా నడుచుకోవాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఐక్యత, సామాజిక బాధ్యత' అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బాగ్చి మాట్లాడారు. సేవా దృక్పథంతో ముందుకు సాగాలని, కలిసి ఉంటే కలదు సుఖమని వివరించారు. మంచి పనులు చేయాలని, ఎవరైనా ప్రమాదానికి గురైతే ఆసుపత్రికి తరలించాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రొఫెసర్ వై.సత్యనారాయణ పలు అంశాలపై సూచనలు చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లు అందచేశారు.

వీఎంఆర్డీఏ కమిషనర్‌కు వీడ్కోలు సన్మానం



విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్

సిరిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పనిచేస్తూ సమాచారశాఖ డైరక్టర్‌గా బదిలీపై వెళ్తున్న కేఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఘనంగా సత్కరించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ అభివృద్ధిలో విశ్వనాథన్ ఎంతో కృషి చేశారని ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో విశ్వనాథన్ సేవలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. విశ్వనాథన్ మాట్లాడుతూ విశాఖలో పనిచేయటం గొప్ప అనుభూతి అన్నారు. అందరి సహకారంతోనే పలు అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగ జేఏసీ హర్షాతిరేకాలు

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పెషల్ డీఎస్సీ షెడ్యూల్ ప్రకటించడం, 11,639 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి డీజీపీని ఆదేశించినందుకు ఏపీ నిరుద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం వద్ద శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. హేమంత్ కుమార్ మాట్లాడుతూ రూ.16 వేల కోట్లతో నారా లోకేశ్ మధురవాడ హిల్ నెంబర్-3 వద్ద సిఫి డేటా సెంటర్‌ను ప్రారంభిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు విశాఖలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

సిటు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలు మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని విశాఖలో ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. శనివారం సిటు కార్యాలయంలో నాయకులు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలకు 70 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుంచి హాజరవుతున్నారని తెలిపారు. సీఐటీయూ ఏర్పడిన 55 సంవత్సరాల్లో మొదటిసారిగా అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్నాయని తెలిపారు. చివరి రోజు జనవరి 4న బీచ్‌రోడ్డులో లక్ష మంది ఎర్రచొక్కాల వాలంటీర్ల కవాతు, ప్రదర్శన, బహిరంగ సభ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి మణి, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయమై తప్పుడు ప్రచారం నమ్మొద్దు'



మాట్లాడుతున్న డాక్టర్ చందక శ్రీకృష్ణ

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తన ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే విషయమై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్థలం యజమాని డాక్టర్ చందక శ్రీకృష్ణ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004లో చిన ముషిడివాడలో అప్పట్లో వుడా వద్ద నుంచి హెచ్ఐజి 2 ఫ్లేట్ 2 సర్వే నెంబర్ 164 ఇంటి స్థలం కొనుగోలు చేశానన్నారు. అప్పట్లోనే తన పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు తెలిపారు. 2021లో ఆ స్థలంలో గృహం నిర్మించడానికి పనులు చేస్తుండగా కొందరు వచ్చి అడ్డుకున్నారని, ఆ స్థలాన్ని తక్కువ ధరకు విక్రయించాలని బెదిరించారని ఆరోపిస్తూ తన వద్ద ఉన్న హక్కు పత్రాలను చూపించారు. తన స్థలంలో ఇంటిని నిర్మించకుండా అడ్డుకుంటున్నారని, అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశామన్నారు. తనను బెదిరిస్తున్నారని, వాస్తవాలు తెలుసుకోవాలని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని డాక్టర్ చందక శ్రీకృష్ణ కోరారు.

రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులు

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి ముందుకు సాగుతుందని, ఇందులో భాగంగా ఉత్తర నియోజకవర్గంలో 25వ వార్డులో పలు ప్రగతి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులు తెలిపారు. సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులకు రూ2.8 కోట్లతో చేపడుతున్న పనులకు వారు శనివారం శంకుస్థాపనలు చేశారు. సీసీ డ్రైన్లు, కల్వర్టులు, బీటీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శ్యామల దీపిక, సురేష్‌బాబు, లొడగల కృష్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా

ఆ జీవోపై పునరాలోచన చేయాలని మహిళా ఆరోగ్య సహాయకుల వినతి

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవో 143తో సీనియర్ మహిళా ఆరోగ్య సహాయకులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నందున ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం సీనియర్ మహిళా సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 143 ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది మాత్రమే ఉండాలన్న నిబంధనతో వేలాది మందికి ఉద్యోగ భద్రతా సమస్య, పదోన్నతి అవకాశాలలో కోతలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్లు సూపర్‌వైజర్ క్యాడర్ పొందే అవకాశాలు కోల్పోతారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న మహిళలకు ఉద్యోగ భద్రత, స్థిరమైన పదోన్నతి విధానం లేకపోవటంతో ఆర్థిక, మానసిక ఒత్తిళ్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సుమారు 90 శాతం మంది చాలాకాలంగా అదే స్థాయిలో కొనసాగుతున్నారని, తమ సుదీర్ఘ సేవలను ప్రభుత్వం గౌరవించి సూపర్‌వైజర్ క్యాడర్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యఆరోగ్య సిబ్బంది

ఘనంగా సెయింట్ జోసెఫ్ అన్నెసీ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

జ్ఞానాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లెవ్యూ ఫ్రాన్స్‌లో సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ ధార్మిక సంఘం ప్రారంభమై 375 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా విశాఖపట్నం ప్రావిన్స్ శనివారం జ్ఞానాపురంలోని సెయింట్‌జోసెఫ్ చర్చిలో వేడుక నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పూల అంథోని, విశాఖ మాజీ అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాష్, సుపీరియర్ ఫాదర్ సురేష్‌బాబు, సుపీరియర్ సిస్టర్ రోజ్ దీప జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించారు. అణగారినవారికి సేవ చేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రేమ, ఐక్యత, సేవా సంకల్పంతో ముందుకు సాగిన ఆరుగురు ధైర్యవంతులైన మహిళలతో పాటు వ్యవస్థాపకుడు జాన్ పియర్ మెడైల్‌ను స్మరించుకున్నారు. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జూబ్లీ సావనీర్‌ను విడుదల చేశారు. సుమారు 600 మంది స్థానిక ప్రముఖులు, పూజారులు, సంఘ సభ్యులు ప్రార్థనలు, ఆత్మపరిశీలనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ సామాజిక సేవలను కొనియాడారు. బాలశౌరి, జాన్ ప్రకాష్ పాల్గొన్నారు.

'అమృత్ సంవాద్‌తో ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు'

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే నిర్వహిస్తున్న అమృత్ సంవాద్ ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం విజయనగరం, కొరాపుట్ స్టేషన్లలో ప్రయాణికులు, వివిధ సంఘాల ప్రతినిధులతో అమృత సంవాద్ నిర్వహించారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఈ.శాంతారామ్ పాల్గొని స్టేషన్‌లో సదుపాయాలను మెరుగుపచడంతోపాటు కొత్త సౌకర్యాలు కల్పించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. స్టేషన్ అభివృద్ధి, సదుపాయాల కల్పనపై ప్రయాణికులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (తూర్పు) సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొరాపుట్‌లో జరిగిన అమృత్ సంవాద్‌లో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) కె.రామారావు హాజరై రైల్వే అధికారులు, ప్రయాణికుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి అమృత్ సంవాద్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు స్వచ్ఛందంగా పాల్గొని అభిప్రాయాలు, సూచనలు పంచుకోవాలన్నారు. అనంతరం ప్రయాణికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.



సమావేశంలో .మాట్లాడుతున్న ఏడీఆర్ఎం శాంతారామ్

కేజీబీవీకి రహదారి నిర్మాణం

భీమునిపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేజీబీవీకి ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ జోన్ వన్ పబ్లిక్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీరు జి. సురేశ్ శనివారం ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ ఇటీవల మంత్రి లోకేశ్ ఈ విద్యాలయాన్ని సందర్శించినప్పుడు గోతులతో ఉన్న రోడ్డును చూసి చలించిపోయారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు నూతన రహదారి నిర్మాణానికి రూ. 1.91 కోట్లు మంజూరు కావడంతో పనులను ప్రారంభించామని తెలిపారు. వారం రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తా మని ఏఈ సురేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కుకు తొలగని చిక్కులు!

... 5వ పేజీ తరువాయి

బాధలు పడలేక చాలామంది ఇతర స్టీల్ ప్లాంట్లలో ఉద్యోగాలు వెదుక్కొని వెళ్లిపోతున్నారు. నగర్‌నార్ స్టీల్ ప్లాంటులో 200 పోస్టులకు ప్రకటన రాగా విశాఖ ఉక్కు నుంచే 800 మంది దరఖాస్తు చేశారు. ఆ ప్లాంటు అడవుల్లో ఉంది. పిల్లల చదువుల గురించి కూడా ఆలోచించకుండా ఉద్యోగులు వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారంటే ఇక్కడ యాజమాన్యం ఎలా పనిచేస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.

రూ.3.5 కోట్లతో యాంటీ డ్రగ్ గ్లో థీమ్ పార్కు

... 5వ పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. కార్యక్రమాన్ని వీఎంఆర్డీఏ కార్యాలయం నుంచి చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ యువత తప్పుడు మార్గంలో వెళ్లకుండా వినూత్నమైన యోచనతో ఈ థీమ్ పార్క్ నిర్మించడం మంచి ఆలోచన అని, ఇది విశాఖలో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి వీఎంఆర్డీఏ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రహదారులు అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ పార్కు అనేది ప్రపంచంలో ఇదే మొదటిదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, మధుసూదనరావు, సీయూపీ శిల్ప, డీఎఫ్‌వో సుజన శివానీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

గరుడ ప్లస్ వంటి ప్రత్యేక సర్వీసుల సగటు ఓఆర్ 95 నుంచి 100 శాతం వరకు నమోదయ్యింది. జోనల్ పరిధిలో రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు కనిష్ఠంగా 120 శాతం, గరిష్ఠంగా 130 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. స్త్రీశక్తి పథకం అమలుతో అత్యధిక సంఖ్యలో మహిళలు ఈ బస్సుల్లోనే ప్రయాణించారని అధికారులు అంటున్నారు.

ఆదాయం రూ.1.05 కోట్లు

దసరాకు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేయడం ద్వారా విశాఖ రీజియన్‌కు రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చినట్టు లెక్కలు కట్టారు. ఇందులో నగదుగా వచ్చింది రూ.30 లక్షలు, స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభుత్వం భరించేది రూ.75 లక్షలు. స్త్రీశక్తి పథకం కింద ప్రయాణించిన మహిళల బస్సు చార్జీల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేయాల్సి ఉంటుంది.

రైళ్లకు దీపావళి తాకిడి

... 5వ పేజీ తరువాయి

సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), ముజాఫర్‌పూర్-బెంగళూరు (15228), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) రైళ్లలో నెలాఖరు వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు.

హౌరా రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), చెన్నై-హౌరా కోరమండల్ (12842), చెన్నై-హౌరా మెయిల్ (12840), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ (18046), బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) రైళ్లకు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అంతేకాకుండా బై వీక్లీ, వారాంతపు రైళ్లు వాస్కోడిగామా-షాలిమార్ (18048), తిరుచరాపల్లి-హౌరా (12664), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై-షాలిమార్ (22826), బెంగళూరు-గువాహటి (12509), బెంగళూరు-హౌరా హంసఫర్ (22888), త్రివేండ్రం-షాలిమార్ (22641), సికింద్రాబాద్-షాలిమార్ (22850), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (20890), మంగళూరు-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22852), నాగర్‌కోయిల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12659), తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22856) రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. వారాంతపు రైళ్లకు కొన్ని తేదీల్లో మాత్రం బెర్తులు అందుబాటులో ఉన్నాయి

సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గరీబ్‌రథ్ (12739), విశాఖ-నాందేడు (20811), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), దురంతో (22203), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), జన్మభూమి (12805), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సాధారణ రద్దీ నెలకొంది. కోణార్క్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రం నెలాఖరు వరకు ఖరారు బెర్తు లభించే పరిస్థితి లేదు. గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి బెర్తులు ఖాళీ ఉండగా...గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 15 నుంచి కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20833, 20708) ఈ నెల 14 నుంచి ఖాళీలు ఉన్నాయి.

హోమ్ స్టే

... 5వ పేజీ తరువాయి ఇస్తుంది.

వసతులు చాలా ముఖ్యం

హోటళ్లలో అతిథులకు ఏయే వసతులు ఉంటాయో అవన్నీ హోమ్ స్టే, బీఅండ్‌బీలలో కూడా ఉండాలి. రూమ్ కనీస విస్తీర్ణం 100 చదరపు అడుగులు, దాని వాష్ రూమ్ 24 చ.అ., కార్పెట్, వై-ఫైతో కూడిన ఇంటర్‌నెట్, చక్కని బెడ్లు, ఫోన్, లాండ్రీ సదుపాయం, లాబీ వంటివి ఉండాలి. 24 గంటల పాటు నీటి సదుపాయం ఉండాలి. సీసీ టీవీ కెమెరాలు తప్పనిసరి. ఆహారం కూడా స్థానికంగా లభించేది, అతిథులు కోరుకునేది అందించగలగాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచాలి. స్థానిక భాషతో పాటు ఇంగ్లిష్, హిందీ వచ్చి ఉంటే మంచిది.

మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రుణాలు

హోమ్ స్టే, బీఅండ్‌బీ ఇళ్లను ఆధునీకీకరించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగరాల్లో మెప్మా ద్వారా రుణాలు అందిస్తారు. గిరిజనులకు అయితే రూ.5 లక్షలు, పట్టణాల్లో అయితే రూ.3 లక్షలు ఇస్తారు. ఈ హోమ్ స్టేలు అన్నీ పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో సందర్శనీయ స్థలాలకు దగ్గరగా ఉండాలి. ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుంది. హోమ్ స్టే ఇళ్లకు విద్యుత్, నీరు, ఇంటి పన్ను కమర్షియల్‌గా కాకుండా డొమెస్టిక్ విధానంలో చార్జీలను వసూలు చేస్తుంది. ఉత్తమ సేవలకు అవార్డులు కూడా అందజేస్తుంది.

రిజిస్ట్రేషన్‌తో వ్యాపారం

ప్రభుత్వ పోర్టల్‌లో వీటిని నమోదు చేసుకుంటే వ్యాపారం ఎక్కువగా వస్తుంది. పర్యాటకులు వెబ్‌సైట్ చూసినప్పుడు ఏ ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నారో...అక్కడ ఈ స్టేలు అన్నీ కనిపిస్తాయి. ఇంటికి సంబంధించిన ఫొటోలు కూడా అందులో పెట్టడం వల్ల వారికి నచ్చినవి ఎంపిక చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రచారం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. ఇదొక్కటే కాకుండా ఈ వివరాలన్నీ ఓయో, మేక్ మై ట్రిప్, స్టే విస్టా వంటి సంస్థలు కూడా తమ వెబ్‌సైట్లలో ప్రదర్శిస్తాయి. వారి ద్వారా కూడా బుకింగ్స్ వస్తాయి. వీటిలో ఒక్కో గదికి వెయ్యి రూపాయల నుంచి రూ.1,500 వరకు అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏడాదికి 200 రోజులు

రాష్ట్రంలో ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలో ఉన్న హోమ్ స్టేలు, బీఅండ్‌బీలను పది వేలకు చేర్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రతి హోమ్ స్టేకు ఏడాదిలో అంటే 365 రోజుల్లో కనీసం 200 రోజులు అతిథులు వచ్చేలా చేయాలనేది ఆలోచన. దీని ద్వారా పర్యాటకం...దీంతోపాటు స్థానికులకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ హోమ్ స్టేకు సంబంధించి పూర్తి వివరాలకు ప్రభుత్వ మేనేజర్ రాజ్యలక్ష్మిని 9121144095 సెల్ నంబర్‌లో సంప్రతిస్తే మరిన్ని వివరాలు తెలియజేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కనీసం రెండు వేల హోమ్ స్టేలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఖాళీ ఇళ్లను అద్దెకు ఇచ్చుకోవడం కంటే వసతులను మెరుగుపరిచి హోమ్ స్టేగా మార్చుకుంటే మంచి ఆదాయం వస్తుందని పర్యాటక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఈదురుగాలులకు విరిగిన చెట్ల కొమ్మలు

ఆరిలోవ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధి పదో వార్డులో పాత డైరీఫారానికి సమీపంలోని రాజీవ్‌నగర్ కూడలిలో విరిగిపడిన చెట్ల కొమ్మలను శానిటరీ సిబ్బంది తొలగించారు. శనివారం వేకువజామున గాలితో కూడిన వర్షానికి కొమ్మలు విరిగిపడ్డాయి. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడికి స్థానికులు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పడిపోయిన చెట్ల కొమ్మలను వ్యాన్లలో తరలించే ఏర్పాటు చేశారు.

35 శాతం మధ్యంతర భృతికి ఎస్‌టీయూ డిమాండ్

ఆరిలోవ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేసి తమది ఉద్యోగవర్గాల స్నేహపూర్వక ప్రభుత్వంగా రుజువు చేయాలని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు కోరారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఆర్థిక పరమైన అంశాలలో జాప్యం చేయకుండా పరిష్కరించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు కావస్తున్నా మధ్యంతర భృతి ప్రకటించకపోవడం, పెండింగ్ డీఏలు ఇవ్వకపోవడం, పీఆర్‌సీని ప్రకటించకపోవడంతో ఉద్యోగవర్గాలు ఆవేదన చెందుతున్నాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలకు ఆరోగ్య భద్రత పేరుతో ఏర్పడిన ఈహెచ్‌ఎస్ ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ ప్రతీనెల ఉద్యోగి జీతాల నుంచి కొంత సొమ్ము చెల్లిస్తున్నప్పటికీ వారికి అనారోగ్య పరిస్థితులు వచ్చినప్పుడు ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం అందించడానికి నిరాకరిస్తున్నారని అన్నారు. ఎఫ్ఏపీటీఓ డిమాండ్లలో భాగంగా రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆర్థికపరమైన అంశాలతో పాటు బోధనకు ఆటంకం కలిగించే యాప్‌లను బహిష్కరిస్తున్నామని అన్నారు.

అప్పుఘర్ వద్ద అన్నదానం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిదో వార్డు పరిధిలోని అప్పుఘర్ వద్ద నిర్వహిస్తున్న విజయదశమి వేడుకల్లో భాగంగా శనివారం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తనయుడు ప్రతాప్ రుద్ర ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటరు గొలగాని మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్‌పై అవగాహన

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనపై దివీస్ కర్మాగారంలో శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ అమర్జీత్ మిశ్రా మాట్లాడుతూ యువతకు ఉపాధి కల్పించడానికి వీలుగా పరిశ్రమల్లో ఉన్న అవకాశాలను వివరించారు. ఆగస్టు 1న ప్రారంభమైన ఈ పథకం రెండేళ్ల పాటు ఉంటుందని, పరిశ్రమ ల్లో ఎక్కువ మందికి ఉద్యోగాలు కల్పించవలసిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్ర మంలో పీఎఫ్ సహాయ కమిషనర్ ధర్మేంద్ర గుర్జార్, అధికారులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, కోటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 72, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


కొత్త వెంకోజీపాలెం బస్టాప్ వద్ద పైప్‌లైన్ కోసం గొయ్యి తవ్వి అసంపూర్తిగా వదిలేసిన దృశ్యం


హెచ్‌బీ కాలనీ ప్రధాన రహదారిలో గొయ్యి


పాత వెంకోజీపాలెం జంక్షన్ వద్ద గోతులు

వాహనదారుల వెన్నులో వణుకు

- అధ్వాన రహదారులతో అవస్థలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

వెంకోజీపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలోని 15, 16 వార్డుల్లోని ప్రధాన మార్గాల్లో రోడ్లు గోతులమయంగా మారాయి. సత్యం జంక్షన్ నుంచి జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను అధిగమించేందుకు సీతమ్మధార మీదుగా హెచ్‌బీకాలనీ, కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారిపైకి చేరుకుంటారు. మద్దిలపాలెం ఆటో మోటివ్ నుంచి కృష్ణా కళాశాల మీదుగా హెచ్‌బీ కాలనీ, పాత వెంకోజీపాలెం, కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారికి చేరుకుంటారు. ఈ మార్గాల్లో వాహనచోదకులకు ట్రాఫిక్ కష్టాలు లేకున్నా, శారీరక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గోతులు పడ్డాయి. హెచ్‌బీ కాలనీ పైజంక్షన్‌లో చిన్న గొయ్యిగా ఏర్పడి, వర్షాలకు కాస్త పెద్దదిగా మారింది. కృష్ణా కళాశాల మార్గంలోనూ వాహన చోదకులకు గోతులు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. రాకపోకల సమయంలో వాహనాలు గోతుల్లో దిగడంతో వెన్నుపూస అదురుతోందంటూ గగ్గోలు పెడుతున్నారు. చాలా రోజుల నుంచి గుంతలు ఇలానే ఉన్నా పట్టించుకునేవారే కరవయ్యారని వాపోతున్నారు. కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న బస్టాప్ వద్ద మంచినీటి పైపులైన్ లీకవుతున్న కారణంగా మరమ్మతుల కోసం తవ్విన గోతులను అసంపూర్తిగా పూడ్చారు. దీంతో అటువైపు వెళ్లే భారీ వాహనాలు సైతం గోతుల్లో పడి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని వాహనచోదకులు వేడుకుంటున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగి విశాఖ కీర్తి ప్రతిష్ఠలు చాటాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆకాక్షించారు. శివాజీపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం విశాఖ డిస్ట్రిక్ వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-25 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న పోలీస్ బ్యారెక్స్ మైదానంలో ఈ పోటీలు ఉంటాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులే కాకుండా ముప్పై ఏళ్లు దాటిన ఔత్సాహిక క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించవచ్చన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు మంగవరప్రసాద్ మాట్లాడుతూ 5 కిలో మీటర్ల వాకింగ్, 100, 200, 400, 800, 1500, 5000 మీటర్ల పరుగు పందెం, ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్క్ త్రో, జావెలిస్ త్రో, హేమర్ త్రో తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 30-34 వయసు, ఆపైన పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి విజేతలకు స్వర్ణ, కాంస్య, రజత పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన క్రీడాకారులను డిసెంబరు 13, 14 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 20లోపు తమ పేర్లు నమోదు చేసుకుని 26న ఉదయం 6 గంటలకు బ్యారక్స్ మైదానంలో హాజరుకావాలని కోరారు. మరిన్ని వివరాలకు 97013 47311, 83091 57522 నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు చింతలపాటి వంశీకృష్ణ, ఎం.రామారావు పాల్గొన్నారు.


విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్

విశ్వనాథన్‌కు సత్కారం

సిరిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పనిచేస్తూ సమాచారశాఖ డైరక్టర్‌గా బదిలీపై వెళ్తున్న కేఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఘనంగా సత్కరించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ అభివృద్ధిలో విశ్వనాథన్ ఎంతో కృషి చేశారని ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో విశ్వనాథన్ సేవలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. విశ్వనాథన్ మాట్లాడుతూ విశాఖలో పనిచేయటం గొప్ప అనుభూతి అన్నారు. అందరి సహకారంతోనే పలు అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులను శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేసి, శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. నిత్య కల్యాణానికి ముందు సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు.


కృష్ణా కళాశాల రోడ్డులో తోపుడు బండిపై టిఫిన్ సెంటర్


ఆటో మోటివ్ జంక్షన్ సమీపంలోని మెకానిక్ షెడ్

రోడ్లపై యథేచ్ఛగా వ్యాపారాలు

- ఆక్రమణలు తొలగించిన రెండు వారాల్లో మళ్లీ యథాస్థితి
- బడ్డీల స్థానంలో తోపుడు బండ్లు

వెంకోజీపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ రెండు వారాల క్రితం ఆపరేషన్ లంగ్స్ పేరిట ఆక్రమిత స్థలాల్లో బడ్డీలను తొలగించింది. పేదలు రోడ్డున పడ్డారని, దసరా వ్యాపారం చేసుకోనివ్వాలన్న ఒత్తిడి మేరకు జీవీఎంసీ అధికారులు వెసులుబాటు కల్పించారు. రెండు వారాలు తిరగక ముందే బడ్డీల స్థానంలో తోపుడు బండ్లు ఏర్పాటు చేసి, షెడ్‌లకు బదులు పైన టార్పాలిన్లు కట్టుకుని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు.ఆటో మోటివ్ జంక్షన్ నుంచి హెచ్‌బీకాలనీ, సీతమ్మధార జంక్షన్ వరకు జీవీఎంసీ వారు బడ్డీలను తొలగించడంతో రహదారులు విశాలంగా కనిపించాయి. హెచ్‌బీకాలనీ ప్రాంతంలో ప్రతి శనివారం జరిగే సంత ఈ బడ్డీల కారణంగా రోడ్డుపైకి వచ్చి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. బడ్డీల తొలగింపు తరువాత శనివారం సంత జరుగుతుందా? లేదా? అనే సందేహం కొనుగోలుదారులకు కలిగింది. బడ్డీల తొలగింపుతో సంత వ్యాపారులు బడ్డీల స్థానంలో వ్యాపారాలు కొనసాగించడంతో వాహనదారులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బడ్డీల ప్రాంతంలో పూర్తి స్థాయిలో వ్యాపారాలను సాగించకపోయినా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని చిన్న చిన్న వ్యాపారాలను మళ్లీ మొదలుపెట్టారు.

కృష్ణా కళాశాల వద్ద ఉండే పెద్ద టిఫిన్ సెంటర్ (రెడ్డి గారి టిఫిన్ సెంటర్) షెడ్‌ను తొలగించడంతో ఇప్పుడు టార్పాలిన్ వేసి, తోపుడు బండి, దోసెల పెనం ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం వ్యాపారం నిర్వహిస్తున్నారు. కృష్ణా కళాశాల మార్గంలో ఓ ప్రైవేటు కళాశాల ముందు తోపుడు బండి, దోసెల పెనం రోడ్డుపైనే పెట్టి వ్యాపారం చేస్తున్నారు. ఆటో మోటివ్ సమీపంలోని వైసీపీ కార్యాలయం ఎదుట చిన్న చిన్న షెడ్లు ఏర్పాటు చేసి భారీగా మెకానిక్ షాపులు నడుపుతున్నారు. హెచ్‌బీకాలనీ, సంజయ్ గాంధీ కాలనీ, దుర్గా ఆలయం వద్దనున్న మెకానిక్ షెడ్ పూర్తిగా తొలగించే లేదు.

అలరించిన అతివల ర్యాంప్ వాక్


కార్యక్రమంలో పాల్గొన్న అతివలతో నిర్వాహకులు

రామ్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో అతివల ర్యాంప్ వాక్‌లతో మెగా మోడలింగ్ మేకప్ అవార్డ్సు ప్రదానం చేశారు. శనివారం రాత్రి రామ్‌నగర్‌లోని ఓ హోటల్‌లో గ్లోఅప్ గాలా పేరిట విశాఖలో తొలిసారిగా చేపట్టిన మేకప్ అవార్డ్సు కార్యక్రమం ఆహూతులను అలరించింది. అతివలు ఇండియన్ బ్రైడ్స్, లేహంగాస్, వెస్ట్రన్ గౌన్స్, శారీస్‌లతో ర్యాంప్‌వాక్ చేశారు. మేకప్ ఆవశ్యకతను తెలియజేస్తూ విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను మరింతగా పెంచేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 30 మంది అతివలు ఈ పోటీలకు హాజరయ్యారు. న్యాయనిర్ణేతలుగా మిస్ ఇండియా యూనివర్స్ హేమ లతారెడ్డి, మిస్ ఒడిశా సుప్రియ, మిస్ ఆంధ్ర సరితా వ్యవహరించగా, వీరు మామ సౌమ్య, తదితరులు పాలొన్నారు.

16 నుంచి అనంతుని పవిత్రోత్సవాలు

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు అనంత పద్మనాభుడి పవిత్రోత్సవాలు జరగనున్నట్టు దేవస్థానం ఈఓ పీవీఎస్ రాజు తెలిపారు. శనివారం ఆయన స్థానిక కుంతీమాధవస్వామి ఆలయంలో ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గత సంప్రదాయాలను, ఆనవాయితీని కొనసాగిస్తూ ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. నిర్వహణకు సభ్యులంతా సహకరించాలని కోరారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్. నారాయణమూర్తి, చిత్రంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కూడా ఉన్నారు.

తెలుగుతో పాటు ఆంగ్లంలోనూ పట్టు ఉండాలి

సినీ నటుడు ఆర్. నారాయణమూర్తి

తగరపువలస, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించాలంటే తెలుగుతో పాటు ఆంగ్లంపై కూడా పట్టు సాధించాలని సినీ నటుడు, దర్శకుడు ఆర్. నారాయణమూర్తి అన్నారు. చిట్టివలస జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎన్‌ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతుల్లో శనివారం ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు భాష ఒక్కటే వస్తే ప్రయోజనం ఉండదని, ఆంగ్లంలో కూడా ప్రావీణ్యం సంపాదిస్తేనే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలరని తెలిపారు. అలా అని మాతృభాషను మరిచిపోకూడదని, అమ్మభాషలో ప్రావీణ్యం ఉంటే ఎన్ని భాషలైనా నేర్చుకోవచ్చునని చెప్పారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ సేవా దృక్పథంతో నిర్వహిస్తున్న ఇటువంటి శిక్షణల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అనంతరం వింగ్స్ ఫౌండేషన్ తరఫున ఆనంద్ అందించిన ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలను ఎమ్మెల్సీ చిరంజీవిరావు, ఆర్. నారాయణమూర్తి పంపిణీ చేశారు. అలాగే శిక్షణ ఇస్తున్న పది మంది ఉపాధ్యాయులను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.ఆదినారాయణ, బి. అప్పారావు, దంతంశెట్టి సత్యారావు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు మోహనరావు, ఆర్. అప్పారావు, జీవీ అప్పారావు, రమణ, జోషి తదితరులు పాల్గొన్నారు.


వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ కాలనీకి వెళ్లే మలుపులో నో పార్కింగ్ బోర్డు వద్ద నిలిపి ఉన్న వాహనాలు

నినాదానికే 'నిషేధం'.. పార్కింగ్ యథాతథం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): హనుమంతువాక నుంచి వచ్చేటప్పుడు వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ కాలనీకి మలుపు తిరిగే చోట వాహనాల నిలిపివేత వల్ల ప్రయాణికులు, వాహనచోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మలుపులో ఉన్న కార్పొరేట్ ఆసుపత్రికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారు తమ వాహనాలను అక్కడే నిలిపేస్తున్నారు. దీంతో సమస్య తీవ్రంగా ఉంటోంది. ఒక్కోసారి చాలాసేపు జాతీయ రహదారిపై వాహనాలు నిలిచిపోవాల్సి వస్తోంది. ఈ సమస్య నివారణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, కేవలం రెండు నో పార్కింగ్ బోర్డులు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడం వల్ల వాహనాల పార్కింగ్ షరా మామూలుగానే ఉంది. ఈ మలుపు సమీపంలోనే సిగ్నల్స్ కూడా ఉండటం వల్ల ఎప్పటికప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. పరిస్థితిని చక్కదిద్దాల్సిన ఎంవీపీ ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు.

ప్రజలు ఆనందంగా ఉండాలి : వెలగపూడి


అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఆరిలోవ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 12వ వార్డులోని శివాలయం సమీపంలో దేవీ నవరాత్రుల సందర్భంగా కొలువుదీరిన దుర్గాదేవి పూజలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు లభించి సుఖశాంతులతో ఉండాలని పూజించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు ధూలి రఘు, ఒమ్మి పోలారావు, గాడి సత్యం, రాయిపల్లి రవితేజ, పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు అనుపు ఉత్సవం నిర్వహించారు.

ఈ-సేవలో ఉద్యోగాలకు 'అభ్యర్థన దీక్ష'


దీక్షలో పాలొన్న నిరుద్యోగులు

సిరిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అర్బన్ ఈ-సేవ కేంద్రాల్లో పనిచేస్తూ వైసీపీ ప్రభుత్వంలో తొలగించిన వారికి తిరిగి ఉపాధి కల్పించాలని కోరుతూ బాధిత నిరుద్యోగులు శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద అభ్యర్థన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ ఈసేవ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈసేవ కేంద్రాల్లో పనిచేస్తున్న 607 మందిని వైసీపీ ప్రభుత్వం తొలగించి, ఆయా కుటుంబాలను రోడ్డున పడేసిందన్నారు. యువగళం పాదయాత్రలో తమను ఆదుకుంటామని మంత్రి లోకేశ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

యూజీడీ పనులు పరిశీలన

వెంకోజీపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీనరసింహనగర్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో రూ. 40 లక్షలతో నిర్వహిస్తున్న యూజీడీ పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య శనివారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని, స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని యూజీడీ అధికారులకు చెప్పారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ద్వారా జీవీఎంసీ నిధులు రూ.40 లక్షలతో లక్ష్మీనరసింహనగర్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రక్షణ గోడలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సత్వరమే పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ యూజీడీ ఏఈ రహీమ్, సివిల్ వర్క్ ఏఈ చందు, లక్ష్మీ నరసింహనగర్ ప్రెసిడెంట్ నరసింగరావు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు సూరిబాబు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల నిరసన

సిరిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏఎన్‌ఎంలు జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 143తో సీనియర్ ఏఎన్‌ఎంలకు ఉద్యోగోన్నతి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకురాలు వెంకటలక్ష్మి మాట్లాడుతూ జీవో నంబర్ 143 విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. 33 ఏళ్ల సర్వీసు చేసినా, ఏఎన్‌ఎంగానే ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోందన్నారు. ఎంతో కష్టపడి పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని కోరారు.

కళా భారతిలో కూచిపూడి నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో శనివారం చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. వెంపటి చిన్న సత్యం 96వ జయంతి పురస్కరించుకుని కూచిపూడి కళాక్షేత్ర, ఆర్.టెన్ డాన్స్ అసోసియేషన్ సంయుక్తంగా వెంపటి జయంతి నృత్యోత్సవం పేరిట చేపట్టిన ఈ కార్యక్రమంలో 400 మంది చిన్నారులు ఆంధ్రప్రదేశ్ శాస్త్రీయ, సాంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి ప్రేక్షకులకు కనువిందు చేశారు. అద్భుతమైన హావభావాలతో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సెంచూరియన్ యూనివర్సిటీ ఉపకులపతి జి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ నేటి తరం చిన్నారులంతా ఏదో ఒక సాంప్రదాయ నృత్యం నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కళల్లో శిక్షణ ఇచ్చి భారతదేశ సంస్కృతిని అలవాటు చేయాలన్నారు. ఆడిటోరియంలో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు దేశ సంస్కృతికి అద్దం పట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు సత్యనారాయణరాజు, కూచిపూడి కళాక్షేత్ర క్షేత్ర కార్యదర్శి కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన వై. ఏకాంబరేశ్వరరావు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్నప్రసాద విభాగం పర్యవేక్షణాధికారి పాలూరి నరసింగరావుకు శనివారం ఆయన అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు అధికారులు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

గౌరవనీయులైన కృష్ణాజిల్లా 15వ అదనపు జిల్లా జడ్జి - నూజివీడు వారి కోర్టులో

యమ్.వి.ఓ.పి. నెం.40/2023

బిట్వీన్ :-
వనమా చంద్రమ్మ మరియొకరు ... పిటీషనర్స్
మరియు
బోజంకి అప్పల కృష్ణ మరియు ఇతరులు ... రెస్పాండెంట్

టూ:- 2వ రెస్పాండెంట్.
గొట్టిపల్లి రామారావు, తండ్రి. తాతారావు, నివాసం: డోర్ నెం.13-590, పార్వతి నగర్ సెక్టార్-2, ఆరిలోవ, విశాఖపట్నం జిల్లా-530040

పై నెంబరు యమ్.వి.ఓ.పి లో 2వ రెస్పాండెంట్ అయిన మీరు పైన పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గాను వాయిదా ది. 30-10-2025 వ తేదీన వున్నది. సదరు తేదీన ఉదయం 10-30 ని లకు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయంగాని, లేదా మీ తరఫు న్యాయవాది గారి ద్వారా గాని హాజరు అయ్యి మీ అక్షేపణలను తెలుపు కొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారముగా

ఇట్లు
నూజివీడు ది.09-10-2025 | మున్న నాగేశ్వర రావు, బి. దేవరావం వాది తరఫు న్యాయవాదులు



కనకమహాలక్ష్మి అమ్మవారికి ఘనంగా తులసీ దళార్చన

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి విశేష పూజలో భాగంగా శనివారం భక్తిశ్రద్ధలతో తులసి దళార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు నిర్వహించిన పూజలో ఉభయ దాతలు, భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఇకపై ప్రతి మంగళవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన జరుపనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల కోరిక మేరకు మునుపటికంటే ఒక గంట ఆలస్యంగా పుష్పార్చన జరపనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు రూ.1,116 చెల్లించి ఉభయదాతలు పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రచారం

అక్కయ్యపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా గ్రేటర్ 43వ వార్డులో టీడీపీ అధ్యక్షురాలు బొడ్డేటి శ్రీదేవి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపు వివరాలను ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొడ్డేటి మోహనరావు, రాజగిరి కన్నబాబు, నాయుడు, కన్నారావు, ఆనంద్, లక్ష్మి పాల్గొన్నారు.

'వైద్యుల సమస్యలు పరిష్కరించండి'

మురళీనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యుల సమస్యలను పరిష్కరించి ప్రజలకు మెరుగైన వైద్యసేవల్ని కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మూల వెంకటరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2,800 మంది వైద్యులు వారం రోజులుగా ఆందోళన చేస్తున్న కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలకు ఆటంకం కలుగుతోందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి వైద్య సంఘం ప్రతినిధులతో సంప్రదింపులు చేయాలన్నారు. గతంలో సర్వీసు డాక్టర్లకు 50 శాతం కేటాయించారని, దాన్ని ప్రస్తుతం 15 శాతానికి రాష్ట్ర ప్రభుత్వం తగ్గించిందన్నారు. దీనివలన స్పెషలైజేషన్ కోర్స్ చదవడానికి వైద్యులకు అవకాశం తగ్గిపోతుందన్నారు. అలవెన్సులు, ఇంక్రిమెంట్లు ఇస్తూ ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న డాక్టర్లకు సీట్ల కేటాయింపు ప్రోత్సాహకరంగా ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

డిసెంబరు 14న కాపుల వనభోజన మహోత్సవం

డాబాగార్డెన్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ కాపు యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబరు 14న కాపుల వనభోజన మహోత్సవం నిర్వహించనున్నట్టు కాపు యూత్ అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు మద్దిం శెట్టి సురేష్, ఎర్రంశెట్టి సురేష్ తెలిపారు. శనివారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వనభోజన మహోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాపులందరినీ ఒకే చోటకు చేర్చాలన్న సంకల్పంతో ముడసర్లోవలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపుల సంక్షేమానికి పెద్దపీట వేయాలని కోరారు. దొరబాబు, ఎస్.సత్యనారాయణ, రాము, సుహాస్, జి.శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, కనకారావు పాల్గొన్నారు.

మృతుడి భార్యకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న సత్యనారాయణ

అక్కయ్యపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీర్ణాశయ క్యాన్సర్‌తో మృతి చెందిన ఎల్లాటి సురేష్ కుటుంబ సభ్యులను స్థానిక నాయకుడు పోతు సత్యనారాయణ పరామర్శించి నిత్యావసర వస్తువులు, రూ.5 వేల నగదు అందజేశారు. గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్ రజక వీధికి చెందిన మృతుడి భార్య సావిత్రికి శనివారం ఆర్థిక సాయం, సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో రమాదేవి రజక సేవా సంఘం నాయకులు చిన్నా, ఈశ్వరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ అనుపోత్సవం

పద్మనాభం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గౌరమ్మ అనుపోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఎన్నింటి వారి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవంలో గ్రామస్తులంతా భక్తి ప్రపత్తులతో పాల్గొని నందన్న, గౌరమ్మలకు పూజలు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గౌరమ్మ, నందన్న విగ్రహాలను నిమజ్జనం చేశారు.

రేషన్ బియ్యం ఎగుమతికి చెక్

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి పీడీఎస్ బియ్యం రవాణాను నిలువరించేందుకు నగరంలో మూడుచోట్ల చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తున్నారు. ఫ్రైట్ స్టేషన్లు ఉన్న షీలానగర్‌లో రెండుచోట్ల, పెదగంట్యాడలో ఒకచోట చెక్‌పోస్టులు పెట్టి వాహనాలు తనిఖీ చేస్తారు. ఈ వారంలో చెక్‌పోస్టులలో సిబ్బందిని నియమించనున్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై గ్రామీణులకు అవగాహన కల్పించాలి

కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్ సూచన



కేజీహెచ్‌లో కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్‌ను సత్కరిస్తున్న వైద్యాధికారులు, చిత్రంలో సూపరింటెండెంట్ ఐ.వాణి తదితరులు

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో వచ్చే రొమ్ము క్యాన్సర్‌పై గ్రామీణులకు, ముఖ్యంగా మహిళలకు సమగ్రమైన అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అర్ధాంగి, ప్రముఖ న్యాయవాది దివ్యా ప్రసాద్ సూచించారు. అక్టోబరులో 'పింక్ మంత్' పేరిట రొమ్ము క్యాన్సర్‌పై ఏర్పాటు చేసిన అవగాహనలో భాగంగా కేజీహెచ్ ఆంకాలజీ విభాగం శనివారం ఓ కార్యక్రమం నిర్వహించింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దివ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మహిళ తప్పనిసరిగా ఏడాదికోసారి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని, ఈ విషయంలో నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై విస్తృత అవగాహన కల్పించటంతో పాటు, మహిళలకు మెమోగ్రామ్, ఇతర అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.బుచ్చిబాబు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తిస్తే సకాలంలో నయం చేయవచ్చని తెలిపారు. కేజీహెచ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న అన్ని వైద్య పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టర్ అర్ధాంగి దివ్యప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. గాలిలో పింక్ బెలూన్‌లను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, పలువురు వైద్యులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

బాధ్యత గల పౌరులుగా మెలగాలి: సీపీ బాగ్చి



విద్యార్థినికి సర్టిఫికెట్ అందచేస్తున్న నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా నడుచుకోవాలని నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక కార్యదర్శి శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన ఎన్‌సీసీ విద్యార్థులకు 'ఐక్యత, సామాజిక బాధ్యత' అనే అంశంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ బాగ్చి మాట్లాడారు. సేవా దృక్పథంతో ముందుకు సాగాలని, కలిసి ఉంటే కలదు సుఖమని వివరించారు. మంచి పనులు చేయాలని, ఎవరైనా ప్రమాదానికి గురైతే ఆసుపత్రికి తరలించాలని, పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రొఫెసర్ వై.సత్యనారాయణ పలు అంశాలపై సూచనలు చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లు అందచేశారు.

సిటు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ అఖిల భారత మహాసభలు మొట్టమొదటిసారిగా రాష్ట్రంలోని విశాఖలో ఈ ఏడాది డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. శనివారం సిటు కార్యాలయంలో నాయకులు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మహాసభలకు 70 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 1500 మంది ప్రతినిధులు 29 రాష్ట్రాల నుంచి హాజరవుతున్నారని తెలిపారు. సీఐటీయూ ఏర్పడిన 55 సంవత్సరాల్లో మొదటిసారిగా అఖిల భారత మహాసభలు విశాఖలో జరుగుతున్నాయని తెలిపారు. చివరి రోజు జనవరి 4న బీచ్‌రోడ్డులో లక్ష మంది ఎర్రచొక్కాల వాలంటీర్ల కవాతు, ప్రదర్శన, బహిరంగ సభ, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి మణి, జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ కమిషనర్‌కు వీడ్కోలు సన్మానం



విశ్వనాథన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, వీఎంఆర్‌డీఏ చైర్మన్

సిరిపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ కమిషనర్‌గా పనిచేస్తూ సమాచారశాఖ డైరక్టర్‌గా బదిలీపై వెళ్తున్న కేఎస్ విశ్వనాథన్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్, వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్ ఘనంగా సత్కరించారు. వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వీఎంఆర్‌డీఏ అభివృద్ధిలో విశ్వనాథన్ ఎంతో కృషి చేశారని ప్రణవ్ గోపాల్ పేర్కొన్నారు. నగర అభివృద్ధిలో విశ్వనాథన్ సేవలు ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు. విశ్వనాథన్ మాట్లాడుతూ విశాఖలో పనిచేయటం గొప్ప అనుభూతి అన్నారు. అందరి సహకారంతోనే పలు అభివృద్ధి పనులు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు. జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్టేట్ అధికారి దయానిధి తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయమై తప్పుడు ప్రచారం నమ్మొద్దు'



మాట్లాడుతున్న డాక్టర్ చందక శ్రీకృష్ణ

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): తన ప్రైవేట్ స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించే విషయమై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్థలం యజమాని డాక్టర్ చందక శ్రీకృష్ణ తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2004లో చిన ముషిడివాడలో అప్పట్లో వుడా వద్ద నుంచి హెచ్‌ఐజి 2 ప్లేట్ 2 సర్వే నెంబర్ 164 ఇంటి స్థలం కొనుగోలు చేశానన్నారు. అప్పట్లోనే తన పేరున రిజిస్ట్రేషన్ కూడా చేసినట్లు తెలిపారు. 2021లో ఆ స్థలంలో గృహం నిర్మించడానికి పనులు చేస్తుండగా కొందరు వచ్చి అడ్డుకున్నారని, ఆ స్థలాన్ని తక్కువ ధరకు విక్రయించాలని బెదిరించారని ఆరోపిస్తూ తన వద్ద ఉన్న హక్కు పత్రాలను చూపించారు. తన స్థలంలో ఇంటిని నిర్మించకుండా అడ్డుకుంటున్నారని, అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేశామన్నారు. తనను బెదిరిస్తున్నారని, వాస్తవాలు తెలుసుకోవాలని, తప్పుడు ప్రచారాలు నమ్మొద్దని డాక్టర్ చందక శ్రీకృష్ణ కోరారు.

స్పెషల్ డీఎస్సీ ప్రకటనపై నిరుద్యోగ జేఏసీ హర్షాతిరేకాలు



చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న విద్యార్థులు

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పెషల్ డీఎస్సీ షెడ్యూల్ ప్రకటించడం, 11,639 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి డీజీపీని ఆదేశించినందుకు ఏపీ నిరుద్యోగ జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయం వద్ద శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. హేమంత్ కుమార్ మాట్లాడుతూ రూ.16 వేల కోట్లతో నారా లోకేశ్ మధురవాడ హిల్ నెంబర్-3 వద్ద సిఫి డేటా సెంటర్‌ను ప్రారంభిస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. గూగుల్, టీసీఎస్ డేటా సెంటర్లు విశాఖలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రూ.2.8 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ పీలా

సీతంపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలనలో అభివృద్ధి ముందుకు సాగుతుందని, ఇందులో భాగంగా ఉత్తర నియోజకవర్గంలో 25వ వార్డులో పలు ప్రగతి కార్యక్రమాలు చేపడుతున్నట్లు నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులు తెలిపారు. సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద పలు అభివృద్ధి పనులకు రూ.2.8 కోట్లతో చేపడుతున్న పనులకు వారు శనివారం శంకుస్థాపనలు చేశారు. సీసీ డ్రైన్లు, కల్వర్టులు, బీటీ రోడ్లు, అంగన్వాడీ కేంద్రంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శ్యామల దీపిక, సురేష్‌బాబు, లొడగల కృష్ణ, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆ జీవోపై పునరాలోచన చేయాలని మహిళా ఆరోగ్య సహాయకుల వినతి



గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యఆరోగ్య సిబ్బంది

మహారాణిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవో 143తో సీనియర్ మహిళా ఆరోగ్య సహాయకులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నందున ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని గవర్నమెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.వెంకటలక్ష్మి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శనివారం సీనియర్ మహిళా సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ జీవో 143 ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది మాత్రమే ఉండాలన్న నిబంధనతో వేలాది మందికి ఉద్యోగ భద్రతా సమస్య, పదోన్నతి అవకాశాలలో కోతలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్లు సూపర్‌వైజర్ క్యాడర్ పొందే అవకాశాలు కోల్పోతారని తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేస్తున్న మహిళలకు ఉద్యోగ భద్రత, స్థిరమైన పదోన్నతి విధానం లేకపోవటంతో ఆర్థిక, మానసిక ఒత్తిళ్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సుమారు 90 శాతం మంది చాలాకాలంగా అదే స్థాయిలో కొనసాగుతున్నారని, తమ సుదీర్ఘ సేవలను ప్రభుత్వం గౌరవించి సూపర్‌వైజర్ క్యాడర్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన సీనియర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సెయింట్ జోసెఫ్ అన్నెసీ వార్షికోత్సవం



వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

జ్ఞానాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): లెవ్యూ ఫ్రాన్స్‌లో సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ ధార్మిక సంఘం ప్రారంభమై 375 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా విశాఖపట్నం ప్రొవిన్స్ శనివారం జ్ఞానాపురంలోని సెయింట్‌జోసెఫ్ చర్చిలో వేడుక నిర్వహించారు. హైదరాబాద్ ఆర్చ్ బిషప్ మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పూల అంథోని, విశాఖ మాజీ అగ్రపీఠాధిపతులు మల్లవరపు ప్రకాష్, సుపీరియర్ ఫాదర్ సురేష్‌బాబు, సుపీరియర్ సిస్టర్ రోజ్ దీప జ్యోతి ప్రజ్వలనతో వేడుకలు ప్రారంభించారు. అణగారినవారికి సేవ చేయాలన్న లక్ష్యంలో భాగంగా ప్రేమ, ఐక్యత, సేవా సంకల్పంతో ముందుకు సాగిన ఆరుగురు ధైర్యవంతులైన మహిళలతో పాటు వ్యవస్థాపకుడు జాన్ పియర్ మొడైల్‌ను స్మరించుకున్నారు. విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుమల బాల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జూబ్లీ సావనీర్‌ను విడుదల చేశారు. సుమారు 600 మంది స్థానిక ప్రముఖులు, పూజారులు, సంఘ సభ్యులు ప్రార్థనలు, ఆత్మపరిశీలనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని సిస్టర్స్ ఆఫ్ సెయింట్ జోసెఫ్ సామాజిక సేవలను కొనియాడారు. బాలశౌరి, జాన్ ప్రకాష్ పాల్గొన్నారు.

'అమృత్ సంవాద్‌తో ప్రయాణికులకు మరిన్ని సదుపాయాలు'



సమావేశంలో .మాట్లాడుతున్న ఏడీఆర్ఎం శాంతారామ్

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే నిర్వహిస్తున్న అమృత్ సంవాద్ ప్రచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శనివారం విజయనగరం, కొరాపుట్ స్టేషన్లలో ప్రయాణికులు, వివిధ సంఘాల ప్రతినిధులతో అమృత సంవాద్ నిర్వహించారు. విజయనగరంలో జరిగిన కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఈ.శాంతారామ్ పాల్గొని స్టేషన్‌లో సదుపాయాలను మెరుగుపచడంతోపాటు కొత్త సౌకర్యాలు కల్పించడంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. స్టేషన్ అభివృద్ధి, సదుపాయాల కల్పనపై ప్రయాణికులతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (తూర్పు) సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే కొరాపుట్‌లో జరిగిన అమృత్ సంవాద్‌లో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) కె.రామారావు హాజరై రైల్వే అధికారులు, ప్రయాణికుల మధ్య సత్సంబంధాలు నెలకొల్పడానికి అమృత్ సంవాద్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రయాణికులు స్వచ్ఛందంగా పాల్గొని అభిప్రాయాలు, సూచనలు పంచుకోవాలన్నారు. అనంతరం ప్రయాణికుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు.

కేజీబీవీకి రహదారి నిర్మాణం

భీమునిపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేజీబీవీకి ఎట్టకేలకు రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ జోన్ వన్ పబ్లిక్ వర్క్స్ అసిస్టెంట్ ఇంజనీరు జి. సురేశ్ శనివారం ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు మాట్లాడుతూ ఇటీవల మంత్రి లోకేశ్ ఈ విద్యాలయాన్ని సందర్శించినప్పుడు గోతులతో ఉన్న రోడ్డును చూసి చలించిపోయారన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజ్ఞప్తి మేరకు నూతన రహదారి నిర్మాణానికి రూ. 1.91 కోట్లు మంజూరు కావడంతో పనులను ప్రారంభించామని తెలిపారు. వారం రోజుల్లో నిర్మాణం పూర్తి చేస్తా మని ఏఈ సురేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉక్కుకు తొలగని చిక్కులు!

... 5వ పేజీ తరువాయి

బాధలు పడలేక చాలామంది ఇతర స్టీల్ ప్లాంట్లలో ఉద్యోగాలు వెదుక్కొని వెళ్లిపోతున్నారు. నగర్‌నార్ స్టీల్ ప్లాంటులో 200 పోస్టులకు ప్రకటన రాగా విశాఖ ఉక్కు నుంచే 800 మంది దరఖాస్తు చేశారు. ఆ ప్లాంటు అడవుల్లో ఉంది. పిల్లల చదువుల గురించి కూడా ఆలోచించకుండా ఉద్యోగులు వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారంటే ఇక్కడ యాజమాన్యం ఎలా పనిచేస్తున్నదీ అర్థం చేసుకోవచ్చు.

రూ.3.5 కోట్లతో యాంటీ డ్రగ్ గ్లో థీమ్ పార్కు

... 5వ పేజీ తరువాయి

శంకుస్థాపన చేశారు. కార్యక్రమాన్ని వీఎంఆర్డీఏ కార్యాలయం నుంచి చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కమిషనర్ విశ్వనాథన్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ యువత తప్పుడు మార్గంలో వెళ్లకుండా వినూత్నమైన యోచనతో ఈ థీమ్ పార్క్ నిర్మించడం మంచి ఆలోచన అని, ఇది విశాఖలో ప్రత్యేకంగా ఉంటుందన్నారు. అలాగే భోగాపురం విమానాశ్రయం ప్రారంభమయ్యే నాటికి వీఎంఆర్డీఏ చేపట్టిన మాస్టర్ ప్లాన్ రహదారులు అందుబాటులోకి వచ్చేలా చూడాలని సూచించారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ యాంటీ డ్రగ్ పార్కు అనేది ప్రపంచంలో ఇదే మొదటిదన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, సెక్రటరీ మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, మధుసూదనరావు, సీయూపీ శిల్ప, డీఎఫ్‌వో సుజన శివానీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి పండుగ

... 5వ పేజీ తరువాయి

గరుడ ప్లస్ వంటి ప్రత్యేక సర్వీసుల సగటు ఓఆర్ 95 నుంచి 100 శాతం వరకు నమోదయ్యింది. జోనల్ పరిధిలో రాకపోకలు సాగించే ఆర్డినరీ, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులు కనిష్ఠంగా 120 శాతం, గరిష్ఠంగా 130 శాతం ఆక్యుపెన్సీ రేషియోతో నడిచాయి. స్త్రీశక్తి పథకం అమలుతో అత్యధిక సంఖ్యలో మహిళలు ఈ బస్సుల్లోనే ప్రయాణించారని అధికారులు అంటున్నారు.

ఆదాయం రూ.1.05 కోట్లు

దసరాకు ప్రత్యేక సర్వీసులు ఆపరేట్ చేయడం ద్వారా విశాఖ రీజియన్‌కు రూ.1.05 కోట్ల ఆదాయం వచ్చినట్టు లెక్కలు కట్టారు. ఇందులో నగదుగా వచ్చింది రూ.30 లక్షలు, స్త్రీశక్తి పథకం ద్వారా ప్రభుత్వం భరించేది రూ.75 లక్షలు. స్త్రీశక్తి పథకం కింద ప్రయాణించిన మహిళల బస్సు చార్జీల మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి జమ చేయాల్సి ఉంటుంది.

రైళ్లకు దీపావళి తాకిడి

... 5వ పేజీ తరువాయి

సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), ముజాఫర్‌పూర్-బెంగళూరు (15228), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825), అగర్తలా-బెంగళూరు హంసఫర్ (12504) రైళ్లలో నెలాఖరు వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు.

హౌరా రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12704), చెన్నై-హౌరా కోరమండల్ (12842), చెన్నై-హౌరా మెయిల్ (12840), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ (18046), బెంగళూరు-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864) రైళ్లకు నెలాఖరు వరకు బెర్తులు నిండిపోయాయి. అంతేకాకుండా బై వీక్లీ, వారాంతపు రైళ్లు వాస్కోడిగామ-షాలిమార్ (18048), తిరుచరాపల్లి-హౌరా (12664), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై-షాలిమార్ (22826), బెంగళూరు-గువాహటి (12509), బెంగళూరు-హౌరా హంసఫర్ (22888), త్రివేండ్రం-షాలిమార్ (22641), సికింద్రాబాద్-షాలిమార్ (22850), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (20890), మంగళూరు-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22852), నాగర్‌కోయిల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12659), తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22856) రైళ్లకు డిమాండ్ ఏర్పడింది. వారాంతపు రైళ్లకు కొన్ని తేదీల్లో మాత్రం బెర్తులు అందుబాటులో ఉన్నాయి

సికింద్రాబాద్ వెళ్లే రైళ్లకు సాధారణ రద్దీ

విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), గరీబ్‌రథ్ (12739), విశాఖ-నాందేడు (20811), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519), దురంతో (22203), విశాఖ-మహబూబ్‌నగర్ (12861), జన్మభూమి (12805), వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సాధారణ రద్దీ నెలకొంది. కోణార్క్, ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు మాత్రం నెలాఖరు వరకు ఖరారు బెర్తు లభించే పరిస్థితి లేదు. గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి బెర్తులు ఖాళీ ఉండగా...గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 15 నుంచి కొన్ని తేదీల్లో ఏసీ బెర్తులు అందుబాటులో ఉన్నాయి. విశాఖ, సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (20833, 20708) ఈ నెల 14 నుంచి ఖాళీలు ఉన్నాయి.

హోమ్ స్టే

... 5వ పేజీ తరువాయి ఇస్తుంది.

వసతులు చాలా ముఖ్యం

హోటళ్లలో అతిథులకు ఏయే వసతులు ఉంటాయో అవన్నీ హోమ్ స్టే, బీఅండ్ బీలలో కూడా ఉండాలి. రూమ్ కనీస విస్తీర్ణం 100 చదరపు అడుగులు, దాని వాష్‌రూమ్ 24 చ.అ., కార్పెట్, వై-ఫైతో కూడిన ఇంటర్‌నెట్, చక్కని బెడ్లు, ఫోన్, లాండ్రీ సదుపాయం, లాబీ వంటివి ఉండాలి. 24 గంటల పాటు నీటి సదుపాయం ఉండాలి. సీసీ టీవీ కెమెరాలు తప్పనిసరి. ఆహారం కూడా స్థానికంగా లభించేది, అతిథులు కోరుకునేది అందించగలగాలి. ఫస్ట్ ఎయిడ్ కిట్‌ను అందుబాటులో ఉంచాలి. స్థానిక భాషతో పాటు ఇంగ్లిష్, హిందీ వచ్చి ఉంటే మంచిది.

మెప్మా, డీఆర్‌డీఏ ద్వారా రుణాలు

హోమ్ స్టే, బీఅండ్‌బీ ఇళ్లను ఆధునికీకరించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ, నగరాల్లో మెప్మా ద్వారా రుణాలు అందిస్తారు. గిరిజనులకు అయితే రూ.5 లక్షలు, పట్టణాల్లో అయితే రూ.3 లక్షలు ఇస్తారు. ఈ హోమ్ స్టేలు అన్నీ పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో సందర్శనీయ స్థలాలకు దగ్గరగా ఉండాలి. ప్రభుత్వం కూడా రాయితీలు ఇస్తుంది. హోమ్ స్టే ఇళ్లకు విద్యుత్, నీరు, ఇంటి పన్ను కమర్షియల్‌గా కాకుండా డొమెస్టిక్ విధానంలో చార్జీలను వసూలు చేస్తుంది. ఉత్తమ సేవలకు అవార్డులు కూడా అందజేస్తుంది.

రిజిస్ట్రేషన్‌తో వ్యాపారం

ప్రభుత్వ పోర్టల్‌లో వీటిని నమోదు చేసుకుంటే వ్యాపారం ఎక్కువగా వస్తుంది. పర్యాటకులు వెబ్‌సైట్ చూసినప్పుడు ఏ ప్రాంతానికి వెళ్లాలనుకుంటున్నారో...అక్కడ ఈ స్టేలు అన్నీ కనిపిస్తాయి. ఇంటికి సంబంధించిన ఫొటోలు కూడా అందులో పెట్టడం వల్ల వారికి నచ్చినవి ఎంపిక చేసుకుంటారు. ప్రత్యేకించి ప్రచారం చేసుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. ఇదొక్కటే కాకుండా ఈ వివరాలన్నీ ఓయో, మేక్ మై ట్రిప్, స్టే విస్టా వంటి సంస్థలు కూడా తమ వెబ్‌సైట్లలో ప్రదర్శిస్తాయి. వారి ద్వారా కూడా బుకింగ్స్ వస్తాయి. వీటిలో ఒక్కో గదికి వెయ్యి రూపాయల నుంచి రూ.1,500 వరకు అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఏడాదికి 200 రోజులు

రాష్ట్రంలో ప్రస్తుతం చాలా తక్కువ సంఖ్యలో ఉన్న హోమ్ స్టేలు, బీఅండ్‌బీలను పది వేలకు చేర్చాలనేది ప్రభుత్వ లక్ష్యం. ప్రతి హోమ్ స్టేకు ఏడాదిలో అంటే 365 రోజుల్లో కనీసం 200 రోజులు అతిథులు వచ్చేలా చేయాలనేది ఆలోచన. దీని ద్వారా పర్యాటకం...దీంతోపాటు స్థానికులకు ఉపాధి, ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ హోమ్ స్టేకు సంబంధించి పూర్తి వివరాలకు ప్రభుత్వ మేనేజర్ రాజ్యలక్ష్మిని 9121144095 సెల్ నంబర్‌లో సంప్రతిస్తే మరిన్ని వివరాలు తెలియజేస్తారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో కనీసం రెండు వేల హోమ్ స్టేలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఖాళీ ఇళ్లను అద్దెకు ఇచ్చుకోవడం కంటే వసతులను మెరుగుపరిచి హోమ్ స్టేగా మార్చుకుంటే మంచి ఆదాయం వస్తుందని పర్యాటక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

కణితి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డుకు ఆనుకుని దుకాణాల నిర్వహణతో మరింత రద్దీ
- భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని స్థానికుల విన్నపం

గాజువాక, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కణితి రోడ్డులో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కణితి రోడ్డులో సింధియా వైపు ఉన్న కర్మాగారాలకు, ఆయా ప్రాంతాలకు వెళ్లే వారు ఎక్కువమంది ఉండడంతో ఈ మార్గం నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటోంది. ఈ రోడ్డు 60 నుంచి 80 అడుగులు వెడల్పు ఉన్నప్పటికీ ట్రాఫిక్ సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా ఈ రోడ్డులో నిత్యావసర వస్తువులకు సంబంధించిన హోల్‌సేల్ షాపులు, బంగారం షాపులు, మార్కెట్ ఉండడంతో ప్రజలు ఏ వస్తువులు కావాలన్నా ఈ ప్రాంతానికే వస్తుంటారు. దీంతో పాటు కర్మాగారాల్లో పనిచేసే ఉద్యోగుల కూడా ఈ రోడ్డులోనే విధులకు వెళుతుంటారు. ఈ రోడ్డులో రాకపోకలు అధికంగా సాగడంతో ట్రాఫిక్ సమస్యలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. అయితే ఈ మార్గంలో భారీ వాహనాలు రాకుండా స్టాపర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ నియంత్రించే సిబ్బంది లేక భారీ వాహనాలు సైతం యథావిధిగా వస్తున్నాయి. ఈ మార్గంలో ట్రాఫిక్ నియంత్రించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల నిర్వహణ

కణితి రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రంగా మారడానికి ఆక్రమణలు ఒక కారణం. పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఉపయోగించే ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డుపైనే నడవాల్సి వస్తోందని పలువురు పాదచారులు వాపోతున్నారు. దీనికి తోడు దుకాణాలకు వచ్చే వినియోగదారులు వారి వాహనాలను రోడ్డు మీదే పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమవుతోంది. దుకాణ దారులు పార్కింగ్ స్పేస్ ఏర్పాటు చేసుకోకపోవడమే దీనికి ప్రధాన కారణమని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పాదచారులు కోరుతున్నారు.



రద్దీగా కణితి రోడ్డు

ప్రజలను ఐక్యం చేసేందుకు ఆర్ఎస్ఎస్ ఆవిర్భావం

- ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో గోపాలపట్నం ఎమ్మెల్యే గణబాబు
- నగరంలో 153 చోట్ల ఉత్సవాలు నిర్వహిస్తున్నాం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మల్కాపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రజలను ఐక్యం చేసేందుకు ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించిందని గోపాలపట్నం ఎమ్మెల్యే గణబాబు అన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సంరద్భంగా 58వ వార్డు హిమాచల్‌నగర్ బస్తీ ఆండాళమ్మ కాలేజీ ప్రాంగణంలో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ ప్రముఖులు భరతమాత చిత్రటాలకు గోపాలపట్నం ఎమ్మెల్యే గణబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గణబాబు మాట్లాడుతూ నాడు సేవ చేసేవారు రాజకీయాల్లోకి వచ్చేవారని, ఇప్పుడు అలా కాకుండా స్వార్థపూరిత కార్యక్రమాలు చేయడానికి రాజకీయాల్లోకి వస్తున్నారని అన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ విశాఖనగరంలో 153 బస్తీలలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు చేపడుతున్నామని తెలిపారు. ఆర్ఎస్ఎస్ జెండా అన్ని చోట్ల రెపరెపలాడాలని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఎంతో క్రమశిక్షణతో కూడినదని అన్నారు. భారతదేశాన్ని అన్ని దేశాలు హేళన చేసిన సమయంలో స్వామి వివేకానంద భారతదేశం గొప్పదనాన్ని, హిందూమతం గూరించి ప్రపంచ దేశాలకు చటిచెప్పారని అన్నారు. భారతదేశానికి ప్రపంచదేశాలచేత జైజైలు కొట్టించిన ఘనత స్వామి వివేకానందకు దక్కుతుందని ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల్లో భిన్నాభిప్రాయాలు ఉంటాయని కానీ ఆర్ఎస్ఎస్‌లో అటువంటి వాటికి చోటులేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గొల్లవిల్లి కృష్ణరావు, జితీశ్, బీజేపీ నాయకులు పోలిమేర శ్రీనివాసరావు, విజయ్‌బాబు, రామకృష్ణ, కలిదండి బద్రీనాథ్, టీడీపీ నాయకులు రామ్మోహన్‌నాయుడు, పొట్టిమూర్తి తదితరలు పాల్గొన్నారు.



ప్రార్థన గీతం పాడుతున్న గోపాలపట్నం ఎమ్మెల్యే గణబాబు, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

మత్తుపదార్థాల నివారణపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్‌రాజు

గోపాలపట్నం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తుపదార్థాలు వినియోగించడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయని సీఐ చంద్రశేఖర్‌రాజు అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ గోపాలపట్నం సర్కిల్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తు పదార్థాలు వినియోగించడమే కాదు, విక్రయించడం కూడా నేరమేనని అన్నారు. అనంతరం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలపట్నం సర్కిల్ ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ గురునాథరావు నేటి నాయకులకు ఆదర్శం

మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



నివాళులు అర్పిస్తున్న గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి నియోజకవర్గంతో పాటు విశాఖ అభివృద్ధికి గుడివాడ గురునాథరావు చేసిన కృషిని నేటి నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 70వ జయంతిని గుడివాడ అప్పన్న మెమోరియల్ ట్రస్టు మిందిలో శనివారం నిర్వహించింది. ఈ సంరద్భంగా గుడివాడ అమర్‌నాథ్ గురునాథరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి, గుడివాడ లతీశ్, పీవీ సురేశ్, సంద్రాన నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఉద్యోగులకు పరికరాల పంపిణీ

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో పనిచేస్తున్న శానిటరీ ఉద్యోగులకు 22 చెత్తబుట్టలు, తోపుడు బండ్లను వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో శానిటరీ ఉద్యోగులు అవసరమైన పనిముట్లను అందజేసేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుచ్చిబాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

ఎన్.ఎ.డి.జంక్షన్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు వింగ్స్ ఫౌండేషన్ ఎన్ఎమ్ఎమ్ఎస్ పుస్తకాలను శనివారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్ నిర్వహకుడు ఆనంద్ మాట్లాడుతూ ఏటా నిర్వహించే ఎన్ఎమ్ఎమ్ఎస్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసే విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణులు అయితే ప్రతీ నెల రూ.1000 స్కాలర్‌షిప్ ఇంటర్ వరకూ పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ఈ పరీక్షకు సెలవు రోజుల్లో కూడా శిక్షణ ఇస్తున్నట్టు హెచ్‌ఎం జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి,
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య,ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 27, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 34, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 30, బీరకాయలు 32, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 36, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 72, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్ధచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి(పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 72, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిదగుమ్మడి కాయ 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

మిద్దె తోటల పెంపకంపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న యడ్లపల్లి వెంకటేశ్వరరావు

ఆటోనగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పచ్చని మొక్కలతో పల్లె సోయగాన్ని తలపిస్తూ ఇంటికి, వంటికి ఆరోగ్యం, ఆహ్లాదాన్ని అందించటమే మిద్దె తోటల ప్రత్యేకమని రైతు నేస్తం పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. శ్రీనగర్ టీఎస్సార్ టీబీకే కళాశాలలో శనివారం నేచర్ గార్డినర్స్-ప్రకృతి ఒడి, రైతు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 100వ మిద్దెతోట పెంపకం అవాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిపైన తోట పెంచడం వల్ల ఆరోగ్యానికి పెద్ద పీఠ అని అన్నారు. ప్రతి మిద్దే ఒక పచ్చని తోటగా మారినప్పుడు కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. భవనాల కప్పులు బాల్కనీలలో మొక్కలు పెంచడం మిద్దె తోటలంటారని తలశిల బలరామ కృష్ణ అన్నారు. సేంద్రియ ఎరువులతో ఇంట్లో పండించిన తాజా కూరగాయలు, ఆకు కూరలతో ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. కార్పొరేటర్ ఏజే స్టాలిన్, తహశీల్దార్ శ్రీనివాస్, సీఐ పార్థసారథి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించడం, మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. నేచర్ గార్డెనర్స్ ఫౌండర్ మాచవరపు ఐశ్వర్య 13 రకాల అరుదైన విత్తనాలు, కాయకూరల నార్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తలశిల సుజాత, అబి, అనురాధ, భవానీ, విరజశ్రీ రాణి, స్వాతి, సౌజన్య, పునీరి, మనోరమణి, కళాశాల కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

- బీపీవో సర్వీసెస్ ఎండీ ముక్కవల్లి లక్ష్మి

అగనంపూడి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకుని, నూతన ఆవిష్కరణలు రూపొందించే విధంగా ఎదగాలని బీపీవో సర్వీసెస్ ఎండీ ముక్కవల్లి లక్ష్మి అన్నారు. విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి మహిళా టెక్నికల్ ఫెస్టివల్ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకమైన ఆలోచలనలు, న్యాయకత్వ లక్షణాలు పెంపొందించాలనే ఆలోచనతో ఏటా సాంకేతిక ఫెస్టివల్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఫెస్టను పురస్కరించుకుని నిర్వహించిన వివిధ పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం అతిథులను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమలో ప్రిన్సిపాల్ అరుంధతి, కన్వీనర్ మనేంద్రసాయి, కో-కన్వీనర్ వై.లక్ష్మణరావు, అధ్యపకులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలకు శ్రీకారం

పెదగంట్యాడ, అక్టోబరు11(ఆంధ్రజ్యోతి): దయాళ్‌నగర్ గౌరీ సేవాసంఘం ఆధ్వర్యంలో జరుగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలకు శనివారం శ్రీకారం చుట్టారు. ఏటా నిర్వహించే విధంగా ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తామని సంఘం సభ్యులు అన్నారు. ఈ సందర్భంగా ఉత్సవరాటను ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు పసుపు కొమ్ములను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్తీక మాసం ప్రారంభం రోజున గౌరీదేవిని ప్రతిష్ఠించి నెల రోజుల పాటు అమ్మవారికి పూజలు చేసి నిమజ్జనం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు పందిరి రాట

అక్కిరెడ్డిపాలెం (ఆంధ్రజ్యోతి) జీవీఎంసీ 69 వార్డు హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో ఏటా నిర్వహించే గౌరీ పరమేశ్వర నవరాత్రులను పురస్కరించుకుని శనివారం పందిరి రాట ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రధానే అర్చకుడు కొమ్మాజోస్యుల రామారావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 13 నుంచి 25 వరకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు కాలనీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు

గోడపత్రిక ఆవిష్కరణ

నాతయ్యపాలెం గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలకు సంబంధించి గోడపత్రికను కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 17 ఏళ్లగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఈ ఏడాది 29 రోజులపాటు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

పెందుర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97 వార్డు చినముషిడివాడ క్రాంతినగర్‌లో కార్పొరేషన్ నిధులు రూ.35.4 లక్షలతో నిర్మాణం చేయనున్న సీసీ రోడ్డుకు వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంతశంకర్ శంకుస్థాపన చేశారు. వార్డులో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిశోర్, నాయుడు పాల్గొన్నారు.

సిమెంటు గ్రైండింగ్ యూనిట్‌కు ప్రతిఘటన తప్పదు

- పలువురు వామపక్షనాయకులు

పెదగంట్యాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపంలో అదానీ సంస్థ ఏర్పాటు చేస్తున్న అంబుజా సిమెంట్ గ్రైడింగ్ యూనిట్‌కు ప్రతిఘటన తప్పదని వామపక్షనాయకులు ప్రకటించారు. పోతిన సన్యాసిరావు భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. అనంతరం సీపీఐ రాష్ట్రకంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఏజే స్టాలిన్ మాట్లాడుతూ నివాసాలకు చేరువలో సిమెంట్ యూనిట్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత మంతా కాలుష్యంతో నిండిపోతుందని, ప్రజలు నివశించేందుకు వీలు పడదన్నారు. ఇక్కడ సిమెంట్ యూనిట్ ఏర్పాటును సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ ఇలాంటి కాలుష్య కారక పరిశ్రమలు ప్రజల నివాసాలకు దూరంగా ఉండాలని అన్నారు. సిమెంట్ గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి వెంకటేశ్వరులు, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్యంతో నిండిపోతుందని, ప్రజల ఆరోగ్యం తీవ్రంగా పాడవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ ప్రతిష్ఠ ఉత్సవాలు



పంచముఖేశ్వరుడు

కూర్మన్నపాలెం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 'హరహర మహాదేవ.. శంభోశంకర' నామ స్మరణతో నూతన పంచముఖేశ్వర శివాలయాన్ని భక్తులు హోరెత్తించారు. 87 వార్డు కణితి కాళింగుల వీధిలో వేంచేసిన శ్రీ కార్తికేయ, శ్రీ స్వర్ణాకర్షణ భైరవ, శ్రీ భువనేశ్వరి దేవి సహిత శ్రీ పంచముఖేశ్వర స్వామి నూతన దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయాన్ని సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్రలో ఎక్కడా లేని విధంగా 42 అడుగుల ఏకశిలా ధ్వజారోహన చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, హోమాలు, మహాపూర్ణాహుతి, నూతన విగ్రహాల ప్రతిష్ఠ, ఆలయ శిఖర పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. సప్తపది, తలంబ్రాలు, జీలకర్ర-బెల్లం, మాంగళ్యధారణం తదితర ఘట్టాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ బొండా జగన్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల దేవన్‌రెడ్డి, సింహాద్రి ప్రోపర్టీస్ అధినేత సిగిలిపల్లి రవి తదిరతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ప్రగడ శంకరరావు, శ్రీనివాసరావు, ప్రగడ వేణుబాబు, బొడ్డ గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు హర్షనీయం: మేయర్ పీలా



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ పీలా

వేపగుంట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ద్వారా మధ్యతరగతి ప్రజల కొనుగోలు చేసే టీవీలు, మిక్సీలు, వాహనాల ధరలు తగ్గనున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉన్నదని మేయర్ పీలా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కమ్యూనిటీ హాల్‌లో జీఎస్టీ తగ్గింపు వస్తువుల స్టాల్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు, స్థానిక వ్యాపార భాగస్వామ్య సంస్థలతో సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

87వ వార్డులో

కూర్మన్నపాలెం (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. ఈ సందర్భంగా 87వ వార్డు అప్పికొండలో శనివారం 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో భాగంగా ఆయన డ్వాక్రా మహిళలతో కలిసి పలు కాలనీలకు వెళ్లి, ప్రజలకు అవగాహన కల్పించి, కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ శ్లాబులను 4నుంచి 2కు తగ్గించడం శుభ పరిణామమన్నారు. దీని ద్వారా నిత్యావసర సరకుల ధరలు తగ్గుతాయని అన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

అక్కిరెడ్డిపాలెం, (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబ్‌లపై అవగాహన కలిగి ఉండడంతో పాటు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ రమేశ్ కుమార్ అన్నారు. అక్కిరెడ్డిపాలెం జడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని జీఎస్టీకి సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయన మాట్లాడుతు వివిధ వస్తువులతో పాటు నిత్యావసర సరకులపై ధరలు తగ్గాయని, ఈ తగ్గింపు ధరలను సూచించే బోర్డులను దుకాణాల వద్ద ఏర్పాటు చేయాలని వర్తకులకు సూచించారు.కార్యక్రమంలో సంద్రాన నూకరాజు, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

పెందుర్తి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వరునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. వేకువజామున స్వామివారిని మేల్కొలిపి తోమాల సేవ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు పర్యవేక్షణలో శ్రీనివాస హవనం, స్వామివారి కల్యాణం జరిగాయి.











రోగుల జీవితాల్లో వెలుగులు నింపుతూ...

విమ్స్‌లో స్పైనల్ అండ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ద్వారా వెన్నుముక, నాడీ వ్యవస్థ సమస్యలకు అత్యాధునిక వైద్య సేవలు

- రెండేళ్లుగా వేలాది మంది రోగులకు సాంత్వన చేకూరుస్తున్న వైద్య నిపుణులు
- రోజూ పదుల సంఖ్యలో బాధితుల రాక
- ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గత కొన్నాళ్లుగా వెన్నుముక, నాడీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వయసు రీత్యా, ప్రమాదాల వల్ల ఎక్కువ మంది వెన్ను సంబంధిత సమస్యలతో బాధపడుతుండగా, మరికొంతమంది బ్రెయిన్ స్ట్రోక్ బారినపడి కాళ్లు, చేతులు చచ్చుబడి కదల్లేని స్థితికి చేరుకుంటున్నారు. వీరిలో ఎంతో మంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నా సాధారణ స్థితికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరహా సమస్యలతో బాధపడేవాళ్లు కోలుకునేందుకు ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, స్పీచ్ థెరపీ వంటివి చేయించాల్సి ఉంటుంది. అయితే ఈ తరహా సేవలు పొందాలంటే బయట భారీ మొత్తంలో నగదు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఎంతోమంది వేలాది రూపాయలు చెల్లించే స్థోమత లేక మంచానికే పరిమితమై కాలం గడుపుతున్నారు. అటువంటి బాధితులకు మెరుగైన సేవలందించే ఉద్దేశంతో విమ్స్‌లో రెండేళ్ల కిందట స్పైనల్ అండ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో రోజూ పదుల సంఖ్యలో రోగులకు మెరుగైన సేవలందించి వారు కోలుకునేలా చేస్తున్నారు. సుమారు రూ.40 లక్షల విలువ చేసే పరికరాలతో ఐసీయూకే పరిమితమైన ఎంతోమంది రోగులు నడిచి ఇంటికి వెళ్లేలా చేస్తున్నారు. వెన్ను, నాడీ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి మాత్రమే కాకుండా ఎముకులకు సంబంధించిన సమస్యలతో బాధపడే వారికి వివిధ రకాల సేవలను అందిస్తున్నారు.



స్పైనల్ అండ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్

ఎలాంటి సేవలందిస్తున్నారంటే..

ఈ స్పైనల్ అండ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్‌లో న్యూరో కండిషన్స్. అంటే పెరాలసిస్ స్ట్రోక్ వచ్చి ఒక చెయ్యి, కాలు, రెండు చేతులు, రెండు కాళ్లు పడిపోయిన వారికి, గులియన్ సిండ్రోమ్, ప్రమాదాల వల్ల తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిపోయిన వారికి, జనరల్ కండిషన్స్ అంటే నెక్ పెయిన్, నడుము, తుంటి, భుజం, మోకాళ్లు, పాదాల్ల నొప్పులతో బాధపడేవారికి సేవలందిస్తున్నారు. ఆయా బాధితులకు రెండు రకాల సేవలను అందిస్తున్నారు. వీటిలో మొదటిది ఎక్సర్‌సైజ్ థెరపీ, రెండోది ఎలక్ట్రో థెరపీ. అదేవిధంగా కొన్ని రకాల సమస్యకు అడ్వాన్స్‌డ్ లేజర్ టెక్నాలజీ ట్రీట్‌మెంట్ చేస్తున్నారు.

నరాలు, కండరాల్లో రక్త ప్రసరణ జరిగేలా..

న్యూరో సంబంధిత సమస్యలతో బాధపడే వారిలో నరాలు, కండరాల్లో కదలిక ఉండదు. వీరికి ఎక్సర్‌సైజ్ థెరపీలోని సోల్డర్ పుల్స్, థెరా బాండ్స్, వెయిట్ కప్స్, క్వాడ్రిషప్స్ స్ట్రెంత్‌నింగ్, ఎలక్ట్రో థెరపీలో నెర్వ్ స్టిములేషన్, మజిల్ స్టిములేషన్, అనాలజిక్ పల్సర్, రష్యన్ కరెంట్స్, డయా డయానమిక్ కరెంట్స్, బరెస్ట్ టెన్స్‌తో చచ్చుబడిపోయిన నరాలు, కండరాల్లో రక్తప్రసరణ జరిగేలా చేసి కోలుకునేలా చేస్తారు. అంతేకాక స్కాన్ లేజర్, ప్రోబ్ లేజర్ అడ్వాన్స్‌డ్ వైద్య సేవలు అందిస్తున్నారు. నడుము నొప్పి, తుంటి నొప్పితో బాధపడేవారికి డీ కంప్రెషివ్ థెరపీలో కోలుకునేలా చేస్తున్నారు. బ్యాలెన్స్ సరిగా లేక ఇబ్బందులు పడే రోగులకు టిల్టింగ్ టేబుల్, బ్యాలెన్స్ బోర్డుతో నడిచేలా చేస్తున్నారు.


రోగితో ఫిజియోథెరపీ చేస్తున్న వైద్య సిబ్బంది

ఫేషియల్ పెరాలసిస్ బారినపడిన రోగులకు ఫేషియల్ స్టిములేషన్ చేసి సాధారణ స్థితికి వచ్చేలా చేస్తున్నారు. పాదం వద్ద తీవ్రమైన నొప్పితో అల్లాడే రోగులకు లేజర్ ట్రీట్‌మెంట్‌తో ఉపశమనం కలిగిస్తున్నారు. ప్రతినెలా 1,200 నుంచి 1,500 ఓపీ ద్వారా వచ్చే రోగులకు, మరో ఏడు వందల మంది ఇన్ పేషెంట్లకు వైద్య సేవలు అందజేస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొన్ని రోజులపాటు ఐసీయూలో ఉన్నవారికి బెడ్‌సోర్ మేనేజ్‌మెంట్ ద్వారా వీపు భాగంలో వచ్చే పుళ్లను తగ్గిస్తున్నారు. చెస్ట్ ఫిజియో ద్వారా ఊపిరితిత్తుల్లో చేరిన నీటిని తొలగిస్తున్నారు. రోగులకు మెరుగైన సేవలందించి కోలుకునేలా చేస్తున్నామని, ఈ సెంటర్‌కు వచ్చే రోగుల సంఖ్య క్రమంగా పెరుగుతోందని ఫిజియోథెరపిస్ట్ ఆదిత్య తెలిపారు. జీవితంలో నడవలేమని భావించిన ఎంతోమందిని కొద్ది రోజుల్లోనే కోలుకునేలా చేసి పంపించామని పేర్కొన్నారు.

బాధితుల కళ్లలో వెలుగులు చూస్తున్నాం

-డాక్టర్ కె.రాంబాబు, విమ్స్ డైరెక్టర్



ఈ సెంటర్‌లో చికిత్స కోసం వచ్చే ఎంతోమంది రోగులు నెలలు తరబడి అనేక ప్రాంతాల్లో థెరపీలు చేయించుకుని ప్రయోజనం లేక బాధ పడుతున్న వాళ్లున్నారు. విమ్స్‌కు వచ్చిన కొద్ది రోజుల్లోనే మెరుగైన ఫలితం కనిపిస్తుండడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒక చోటకు వెళ్లినప్పుడు ఈ సేవలకు సంబంధించి రోగుల నుంచి భారీగా వసూలు చేస్తుండడాన్ని గుర్తించి నిరుపేదలకు ఉచితంగా ఈ తరహా సేవలను అందించాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులతో మాట్లాడి సెంటర్‌ను ఏర్పాటు చేశాం. సుమారు రూ.40 లక్షల విలువైన అత్యాధునిక పరికరాలతో వేలాది మందికి సేవలు అందిస్తున్నాం. తీవ్రమైన నొప్పులు, మెదడు సంబంధిత సమస్యలతో బాధపడే ఎంతో మందికి ఈ స్పైనల్ అండ్ న్యూరో రీహాబిలిటేషన్ సెంటర్ ఆశాకిరణంగా నిలుస్తోంది. ప్రతి నెల రెండు వేల మంది ఇక్కడ వివిధ రకాల సేవలు పొందుతున్నారు. ప్రస్తుతం నలుగురు ఫిజియోథెరపిస్టులు, పదిమంది స్టాఫ్ నర్సులు, ఎనిమిది మంది ఎంఎన్‌వో, ఎఫ్ఎన్‌వోలు, ఇతర సిబ్బంది సేవలందిస్తున్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ సేవలను బాధితులు సద్వినియోగం చేసుకోవాలి.



మహిళా క్రికెటర్ల సాధన




మహిళల ప్రపంచ కప్ వన్డే టోర్నీలో భాగంగా ఆదివారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆతిథ్య భారత్, ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం స్టేడియంలో పలువురు భారత్ క్రీడాకారులతో పాటు ఆస్ట్రేలియా జట్టు సభ్యులందరూ ముమ్మర సాధన చేశారు. కాగా ఆదివారం మంత్రి నారా లోకేశ్ చేతుల మీదగా స్టేడియంలో మిథాలీరాజ్ పేరిట ఏర్పాటు చేసిన స్టాండ్‌ను, రావి కల్పన పేరుతో ఏర్పాటు చేసిన గేటును ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.





భారత్, ఆస్ట్రేలియా క్రికెటర్లు ప్రియాంక, ప్లైయర్ ఫోబ్ లిచ్‌ఫీల్డ్ బ్యాటింగ్ ప్రాక్టీస్... పక్కన స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న మిథాలీరాజ్ స్టాండ్, రావి కల్పన గేటు

ఆదర్శనీయులు జస్టిస్ రామస్వామి


జస్టిస్ రామస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్. చిత్రంలో ఏయూ వీసీ రాజశేఖర్, తదితరులు

- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ రామస్వామి మహోన్నత వ్యక్తిత్వం కలవారని, ఆయనను న్యాయ కళాశాల విద్యార్థులు, ఆచార్యులు ఆదర్శంగా తీసుకోవలసిన అవసరం ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ అన్నారు. ఏయూలో ఏర్పాటు చేసిన జస్టిస్ కె.రామస్వామి చిత్రపటాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం జస్టిస్ రామస్వామి స్మారకోపన్యాసం చేశారు. పబ్లిక్ పవర్ అండ్ జ్యుడీషియల్ ఫంక్షన్ అనే అంశంపై జస్టిస్ రామస్వామి గతంలో ఏయూలో ప్రసంగించారు ఆయన ప్రసంగాన్ని పునఃముద్రించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

అనంతరం జస్టిస్ దేవానంద్ మాట్లాడుతూ విద్యార్థి నాయకుడిగా తొలిసారి తాను రామస్వామిని కలిసిన సందర్భం, ఏయూకు ముఖ్యఅతిథిగా ఆయనను ఆహ్వానించి తీసుకువచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. జస్టిస్ రామస్వామి చారిత్రాత్మకమైన తీర్పులు ఇచ్చారని పేర్కొన్నారు. ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీ న్యాయ కళాశాల ఎంతోమంది న్యాయకోవిదులను సమాజానికి అందించిందన్నారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, రిజిస్ట్రార్ కె.రాంబాబు, జస్టిస్ రామస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో ఎస్‌బీఐ చైర్మన్


కప్ప స్తంభం వద్ద చల్లా శ్రీనివాసులు శెట్టి

సింహాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని భారతీయ స్టేట్ బ్యాంక్ చైర్మన్, ప్రముఖ ఆర్థికవేత్త చల్లా శ్రీనివాసులు శెట్టి శనివారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయ ఏఈఓ కె.తిరుమలేశ్వరరావు ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఆంధ్ర క్రికెట్ జట్టు మేనేజర్‌గా వెంకటేశ్


వెంకటేశ్

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అండర్-23 క్రికెట్ జట్టు మేనేజర్‌గా నగరానికి చెందిన వై.వెంకటేశ్‌ను నియమిస్తూ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురంలో జరగనున్న బీసీసీఐ అండర్-23 మల్టీ డేస్ క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటివరకు వివిధ దేశవాళీ టోర్నీలలో ఆంధ్ర జట్టుకు మేనేజర్‌గా పనిచేసిన వెంకటేష్‌ను మల్టీ డేస్ క్రికెట్ చాంపియన్‌షిప్ టోర్నీకి మేనేజర్‌గా నియమించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.


అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ కళాశాలల మహిళల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఏయూ ఇండోర్ జిమ్నాజియం హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారిణులను అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్ కళాశాల క్రీడల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమని, వర్సిటీ పోటీల్లో పతకాలు సాధించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఖ్యాతి పెంచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, ఎడ్యుకేషన్ విభాగం ఆచార్య టి.షారోన్‌రాజు, ఫిజికల్ డైరక్టర్లు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయితో ముగ్గురి పట్టివేత

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని వారి నుంచి రూ.42,400 విలువైన 8.480 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బురుగు ఆనందకుమార్ (35) (ఒడిశా), సురకల హరికృష్ణ (25) (తెలంగాణ), రోహిత్ (20) (కర్ణాటక)లు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిని కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.



బీఐఎస్ ప్రమాణాలను ఉపయోగించాలి

- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి

బీచ్ రోడ్డు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దైనందిన జీవితంలో, వాణిజ్యపరమైన ఉపయోగానికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాలు అవసరమని నగర పోలీస్ కమినర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీఐఎస్ విజయవాడ శాఖ, ఆంధ్రాయూనివర్సిటీ సంయుక్తంగా శనివారం బీచ్‌రోడ్డులో వాక్‌థాన్ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిగా విచ్చేసిన సీపీ వాక్‌థాన్‌ను ప్రారంభించి మాట్లాడారు. హెల్మెట్, హాల్‌మార్కు బంగారు ఆభరణాలు, సీఆర్ఎస్ మార్కు ఉన్న ఎలక్ట్రానిక్స్ వంటి ఉత్పత్తులపై తప్పనిసరిగా బీఐఎస్ ప్రమాణాలను ఉపయోగించాలన్నారు.

ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ భారతదేశ జాతీయ ప్రమాణాల సంస్థ ఉత్పత్తుల నాణ్యత, భద్రతను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీఐఎస్ విజయవాడ శాఖ హెడ్ డైరెక్టర్ సైంటిస్ట్ ప్రేమ్‌సజని పట్నాలా, ఏయూ నోడల్ ఫ్యాకల్టీ ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, డిప్యూటీ జాయింట్ డైరెక్టర్ కె.సాయి కౌశిక్, ప్రొఫెసర్ సీఎస్‌వీ సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వాక్‌థాన్‌లో పాల్గొన్న ఏయూ వీసీ రాజశేఖర్, సీపీ శంఖబ్రత బాగ్చి

అప్పన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

- ఒక్కరోజు ఆదాయం రూ. 43. 2 లక్షలు


సింహాచలం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దర్శనానికి భక్తులు శనివారం అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున కొండ దిగువకు వరాహ పుష్కరిణిలో స్నానాలు చేసి, అడివివరం సమీపంలో కొలువుదీరిన భైరవస్వామిని దర్శించుకున్నారు. అనంత రం తొలిపావంచా వద్ద కొబ్బరికాయ కొట్టి మెట్ల మార్గంలో కొందరు, రోడ్డు మార్గంలో మరి కొందరు సింహగిరికి చేరుకుని అప్పన్నను దర్శించుకున్నారు. భక్తుల రద్దీ వల్ల శనివారం ఒక్క రోజే స్వామివారి ఖజానాకు సుమారు రూ. 43.2లక్షల ఆదాయం సమకూరింది. దేవస్థానం రికార్డుల ప్రకారం శ్రీఘ్రదర్శనం రూ.100 టికెట్లు, అతిశ్రీఘ్రదర్శనం రూ.300 టికెట్ల విక్రయాల ద్వారా రూ. 25.22 లక్షలు, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాలు ద్వారా రూ.11.69 లక్షలు ఆదాయం లభించింది. తలనీలాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.2.8 లక్షలు, వసతి సౌకర్యం, విరాళాలు ద్వారా మరికొంత ఆదాయం వచ్చింది. భక్తుల రద్దీని ఈఓ వేంద్ర త్రినాథ రావు ఆలయంలో ఉండి స్వయంగా పర్యవేక్షించారు.


ఆలయంలో భక్తుల రద్దీ

ఏయూతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఎంవోయూ

విశాఖపట్నం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీతో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) జరిగింది. ఏయూ పాలకమండలి సమావేశ మందిరంలో వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పందం జరిగింది. ఏయూ రిజిస్ట్రార్ కె.రాంబాబు, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సత్యనారాయణ హమాపాత్రో ఎంవోయూపై సంతకాలు చేశారు. ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులను సులభతరం చేయడం, నైపుణ్యాన్ని పరస్పరం మార్చుకోవడం, అధునాతన భౌగోళిక అధ్యయనాల్లో విద్యార్థులు, పరిశోధకులకు ప్రత్యక్ష శిక్షణ అందించడమే లక్ష్యంగా అవగాహన ఒప్పందం చేసుకున్నారు. జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె.సత్యనారాయణరెడ్డి, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎంవీఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు



AJC CLASSIFIEDS

JOBS

★ Sales Man to work in Tiles Shop at penduri, vizag : Degree with two years Expr. Age: Below 40years. Rs 15,000 PM + TA + Comm. Contact : 9848110029 AJV_251760

OLD AGE HOME

» శ్రీవైష్ణవి రిటైర్మెంట్ హోమ్స్ హాస్పటల్, ఓల్డ్ ఏజ్ హోమ్స్, హోమ్ నర్సింగ్ సర్వీసెస్, జెరియాట్రిక్, ఫిజియోథెరపి, A/C, Non A/C రూమ్స్ @ MVP / సీతమ్మధార, / విశాలాక్షినగర్ / పి.ఎం.పాలెం. నర్సింహారెడ్డి : 9676000633 . AJV_ 251759

WANTED LAND

» We want 2 acres of Agriculture land (Metta Bhoomi) for 10 Years in lease in/around Visakhapatnam. Contact : 81255 88588 AJV_251755

LAND FOR SALE

» ఎస్.కోట నుండి అరకు హైవేరోడ్ చిలకలపేట చెక్‌పోస్ట్ దగ్గర 2.18 ఎకరముల స్థలం (రిసార్ట్స్‌కు అనుకూలం) సంప్ర: 9542794669 9441340883. AJV_251757

PLOT FOR SALE

» 250చ॥గ॥ల ఇంటి స్థలం వెంకన్నపాలెం గ్రామం లో, చోడవరం దగ్గర అమ్మకం కలదు. సంప్రదించండి : 9515883375. AJV_251756

PLOT FOR SALE

» 269 Sq.yds. VUDA, 50 ft. Rd. W/F, Simhapuri Colony, Nr. BRTC roads, 1/2Km. Vepagunta to Gosala. Ph : 8309494629, 9885180930. AJV_ 241547

FLAT FOR SALE

★ NEW FLAT for SALE 3 BHK Flat - 1850 sft. Second floor, Sea View, Greenery, Total interior work done, All amenities, Ready to Occupy. Car Parking, walkable distance to beach, Official Area, MAHARANIPETA, Vizag. Ph: 99635 96589 AJV_241799

★ 3BHK, 6yrs old E/F 1350sft with complete wood work, grills 100ft road, 2bhk, 1060sft with Modular Kitchen, Grills, 2y Old, Sujathanagar. Ph: 7997274447, 8639168165. AJV_251753

★ Dwarakanagar - 2 BHK Premium Flats, N Facing, No GST, Ready to occupy, Near B.V.K. College, Dwarakanagar, VSP. Ph: 9542794669, 9492458777 AJV_251758

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093